

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 08-09-2022 సంపుటి : 04 సంచిక : 19 పేజీలు : 4 వెల : రూ 3-00


# ముగిసిన ఏపీ కేబినెట్ సమావేశం



అమరావతి : ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశం ఇవాళ సచివాలయంలో భేటీ అయ్యింది. సీఎం జగన్ మోహన్ రెడ్డి అధ్యక్షతన దాదాపు నాలుగు గంటల పాటు జరిగిన సమావేశంలో పలు కీలక అంశాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్ లు, సచివాలయంలో 83 కొత్త పోస్టులను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని నిర్ణయించింది. కియా పరిశ్రమ రిజిస్ట్రేషన్లు ఫీజుల్లో మార్పులు చేసింది.ఏపీలో కొత్తగా 4 శాశ్వత అదాలత్‌లు ఏర్పాటు చేయాలని, ఇందుకు అవసరమైన సిబ్బంది నియామకం చేపట్టేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఏపీ చారిటబుల్ ట్రస్టుకు ఆమోదం. అల్లూరి జిల్లా చింతూరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు ఆమోద ముద్ర వేసింది. తిరుపతిలో నొవాటెల్ బ్రాండ్ పేరుతో 5 స్టార్ హోటల్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. కొత్తగా ఏర్పడిన 24 రెవెన్యూ డివిజన్లలో 456 కొత్తపోస్టుల ఏర్పాటుకు, భావనపాడు పోర్టు విస్తరణకు ఆమోదం తెలిపింది.

# ఈ నెల 10 నుంచి 'మన కడప' పర్యటన ప్రారంభం

వైఎస్ఆర్ జిల్లా : కడప వాసులకు శుభవార్త. జిల్లాలోని పర్యాటక స్థలాలను ప్రజలకు పరిచయం చేసేందుకు కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించారు. 'మన కడప' పేరుతో జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించే సదుపాయాన్ని అధికార యంత్రాంగం అందుబాటులోకి తెచ్చింది. ఈ పర్యాటక ప్రాంతాల సందర్శన ఈ నెల 10 వ తేదీ నుంచి ప్రారంభమవుతుంది.




ఈ పర్యటన విశేషాలను కలెక్టర్ వీ విజయ రామరాజు మీడియాకు వెల్లడించారు.కలెక్టర్ విజయరామరాజు తెలిపిన వివరాల ప్రకారం.. నెలలో ప్రతి ఆదివారం, రెండో శనివారం 'మన కడప' పర్యాటక స్థలాల సందర్శన కార్యక్రమం అందుబాటులో ఉండనున్నది. ఇందుకోసం 40 సీట్ల సామర్థ్యం గల ఎయిర్ కండిషన్డ్ ఇంద్ర బస్సులను అందుబాటులో ఉంచారు. ఈ స్కీంలో పెద్దలకు రూ.500, 6 ? 12 ఏండ్లలోపు పిల్లలకు రూ.300 చొప్పున రుసుం వసూలు చేస్తారు. పర్యాటక స్థలాల సందర్శన ప్రయాణంలో టిఫిన్, మధ్యాహ్న భోజనంతోపాటు స్నాక్స్, టీలు అందజేస్తారు.ఈ పర్యాటక ప్రాజెక్టులో జిల్లాలోని దేవుని కడప వేంకటేశ్వర స్వామి ఆలయం, పుష్పగిరి పీఠం కామాక్షి సహిత విద్యానాదేశ్వరాలయం, వొంటిమిట్ట కోదండరామ స్వామి ఆలయం, సిధావటం కోట తదితర పర్యాటక ప్రాంతాలకు పర్యాటకులను తీసుకువెళ్లనున్నారు. టూరిజం స్పాట్‌ల ప్రాముఖ్యతను వివరించేందుకు గైడ్‌ను కూడా అందుబాటులో ఉంచనున్నారు. వైఎస్ఆర్ జిల్లాలోని వారసత్వ ప్రదేశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ తరహా సదుపాయాన్ని ప్రవేశపెడుతున్నారు. ఈ పర్యాటక సందర్శన బస్సు టికెట్లు పొందేందుకు హరిత హోటల్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు.

# అమరావతినే రాజధానిగా కొనసాగించాలని దీక్ష

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు ఏకైక రాజధాని అమరావతిని కొనసాగించాలని ప్రత్యేక హోదా సాధన సమితి , సీపీఎం ఆధ్వర్యంలో అమరావతి రైతులు అమరావతిలో దీక్షను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రోగెసివ్ డెమోక్రటిక్ ఫోరం ఎమ్మెల్సీ లక్ష్మన్‌రావు , సీపీఎం రాష్ట్రకార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ అమరావతినే రాజధానిగా కొనసాగించాలని కోరుతూ శాసన మండలిలో పీడీఎఫ్ తరఫున డిమాం డ్ చేస్తున్నామని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో అమరావతి రాజధానిగా ఉంటుందని పేర్కొన్నారని శాసనసభ, న్యాయ వ్యవస్థ, పరిపాలన , శాసన మండలి నిర్మాణానికి కేంద్రం నిధులు ఇవ్వాలని పేర్కొన్నారని వివరించారు. వీటికి కేంద్రం నుంచి 47వేల కోట్లు ఇవ్వాలని , కాని ఇప్పటికి వెయ్యి కోట్లు మాత్రమే ఇచ్చిందని తెలిపారు. అమరావతి రాజధాని కోసం తలపెట్టనున్న రైతుల పాదయాత్రకు సంపూర్ణ మద్దతును ప్రకటించారు.




# రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు..

## ఏపీ ప్రభుత్వాన్ని ప్రతివాదిగా చేర్చాలని సుప్రీంకోర్టు ఆదేశం



ఢిల్లీ: ఎంపీ రఘురామకృష్ణారాజు కస్టోడియల్ టార్చర్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. కస్టోడియల్ టార్చర్‌పై విచారణ చేపట్టాలంటూ రఘురామ తనయుడు భరత్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఏపీ ప్రభుత్వాన్ని ప్రతివాదిగా చేర్చాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. 2 వారాల సమయం భరత్ తరపు లాయర్ ఆదినారాయణరావు కోరారు. ఏపీ ప్రభుత్వాన్ని ప్రతివాదిగా చేర్చిన తర్వాత సీబీఐ విచారణకు ఆదేశించే విషయాన్ని పరిశీలిస్తామని సుప్రీంకోర్టు పేర్కొంది. గతంలో ఏపీ ప్రభుత్వాన్ని విమర్శించినందుకు రఘురామకృష్ణరాజుపై రాజద్రోహం మోపారు. ఈ కేసును ఏపీ ప్రభుత్వం సీబీఐకి అప్పగించింది. సీబీఐ విచారణలో ఆయనను చిత్రహింసలకు గురిచేశారనే ఆరోపణలు వచ్చాయి. తనను విచారించే సమయంలో చిత్రహింసలకు గురిచేశారని ఆరోపించారు. రఘురామకృష్ణంరాజు పాదాలకు గాయాలు ఉన్నట్లు సికింద్రాబాద్ ఆర్మీ ఆస్పత్రి నివేదిక తేల్చింది. ఆయన పాదాలను ఆస్పత్రి వైద్య బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. రెండు పాదాలూ కింది వైపు మూడోవంతు బాగా ఉబ్బి ఉన్నాయని, అరికాళ్లు కూడా బాగా వాచాయని పేర్కొంది.కుడి పాదం అరికాలి భాగం వేళ్ల వరకు, ఎడమ కాలు మధ్య, ముందుభాగాలు, అరికాలు, రెండో వేలు బాగా కమిలిపోయాయని నిర్ధారించింది. కుడి పాదం చీలమండ ఎముక, అరికాలు, ఎడమ పాదం మడమ, రెండో వేలు సున్నితంగా మారాయని, వాటిని ముట్టుకుంటే ఆయనకు నొప్పి కలుగుతోందని తెలిపింది. కుడికాలి చీలమండ కదలికలు సాధారణంగా ఉన్నాయని, ఎడమకాలి చీలమండ కదిపితే నొప్పి వేస్తోందని.. కుడి, ఎడమ పాదాల ముందువైపు కీళ్లు, జాయింట్లు నొప్పి కలిగిస్తున్నాయని పేర్కొంది. ఎడమ పాదం రెండో వేలు ఎముక విరగనప్పటికీ దూరమైందని ఎక్స్ రే నివేదిక ఆధారంగా నిర్ధారించింది. ఆ తర్వాత సీఐడీ కస్టడీలో ఎంపీ రఘురామకృష్ణంరాజుపై జరిగిన హింస, అక్రమ అరెస్టుపై సీబీఐ దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్‌లో కేంద్ర ప్రభుత్వానికి, సీబీఐకి సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసిన విషయం తెలిసిందే. దీనిపై తమ స్పందనతో 4 వారాల్లో కౌంటర్ అఫిడవిట్ దాఖలుచేయాలని ఆదేశించింది. అదే సమయంలో.. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం జగన్, మాజీ డీజీపీ గౌతమ్ సవాంగ్, సీఐడీ ఏడీజీ సునీల్ కుమార్, అదనపు ఎస్పీ విజయ పాల్‌ను ప్రతివాదులుగా తొలగించి.. సీబీఐని ప్రతివాదిగా చేర్చాలన్న పిటిషనర్ రఘురామ కుమారుడు భరత్ విజ్ఞప్తికి అంగీకరించింది.

# పరిశీలిస్తే.. సీపీఎస్ రద్దు సాధ్యం కాదని తేలింది: బొత్స సత్యనారాయణ

అమరావతి: ఉద్యోగుల కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు చేస్తామని సీఎం జగన్ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన మాట వాస్తవమేనని..అయితే అధికారంలోకి వచ్చాక పరిశీలిస్తే సీపీఎస్ రద్దు సాధ్యం కాదని తేలిందని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఇప్పటికే చెప్పారన్నారు. తాడేపల్లిలోని సచివాలయం వద్ద బొత్స మీడియాతో మాట్లాడారు. సీపీఎస్ రద్దు చేసే అంశంలో ప్రభుత్వానికి ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నాయని చెప్పారు. సీపీఎస్ కంటే మెరుగైన విధానం అమలు చేసేందుకే ప్రభుత్వం జీపీఎస్ తీసుకువచ్చిందన్నారు. ఉద్యోగ సంఘాలతో జరిగే కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో జీపీఎస్ విధానం అమలుపై మరిన్ని అంశాలు చర్చించనున్నట్లు వెల్లడించారు."ఇప్పటివరకు మా ఇంట్లో నాతో జరిగిన సమావేశాలు అనధికారికమే. ఇవాళ ఉద్యోగ సంఘాలతో జరిపే సమావేశం పూర్తిగా అధికారికమైంది.

# ఏపీ బీజేపీ ఇంఛార్జీ ఇంటికి టీడీపీ ఎంపీ..



టీడీపీ ఎంపీ కేశినేని నాని ఏది చేసినా సంచనలంగానే ఉంటుంది. ఇటీవల ఢిల్లీకి వచ్చిన చంద్రబాబు నాయుడుకు బొకే ఇచ్చేందుకు నిరాకరించడం వివాదాస్పదంగా మారింది. ఇప్పుడేమో ఏకంగా ఏపీ బీజేపీ ఇంఛార్జీ ఇంటికెళ్లి అక్కడ అర్ధ గంట సేపు గడిపారు. ఆయన కుటుంబసభ్యులతో కలిసి గణపతి పూజలో పాల్గొని హారతి ఇచ్చారు. ఈ విషయాన్ని ఫొటోతో పాటు ఏపీ బీజేపీ ఇంఛార్జీ ట్వీట్ చేయడంతో కేశినేని నాని వ్యవహారం బయటకు వచ్చింది.ఆంధ్రప్రదేశ్ బీజేపీ వ్యవహారాల ఇన్‌ఛార్జి సునీల్ దియోథర్ ఇంటికి కేశినేని నాని వెళ్లారు. వినాయక చవితి వేడుకల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మిత్రుడు, విజయవాడ లోక్‌సభ సభ్యుడు కేశినేని నాని ఢిల్లీలోని తన ఇంటికి వచ్చినట్లు ధియోథర్ ట్విట్టర్‌లో వెల్లడించారు. గణపతి పూజలో పాల్గొన్న కేశినేని నాని ఫొటోను సైతం ట్వీట్ చేశారు. బీజేపీకి చెందిన నాయకుడి స్వగృహంలో జరిగిన వినాయకుడి పూజల్లో టీడీపీ ఎంపీ పాల్గొనడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. కొంతకాలంగా కేశినేని నాని బీజేపీకి చేరువవుతున్నారనే ప్రచారం కూడా జరుగుతున్నది. ఈ ప్రచారానికి బలం చేకూరుస్తున్నట్లుగా ఆయన ఢిల్లీలో సునీల్ దియోథర్ నివాసానికి వెళ్లడంపై టీడీపీ నాయకులు చర్చించుకుంటున్నారు.టీడీపీ లైన్‌కు భిన్నంగా కేశినేని నాని వ్యవహారం ఉంటున్నదని విమర్శలు ఉన్నాయి. పార్టీ అధినాయకత్వం పట్ల కేశినేని నాని అసంతృప్తిగా ఉన్నట్లు పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు చెప్తున్నారు. అయితే, అందరి ఊహలకు భిన్నంగా ఆయన తన అసంతృప్తిని బహిరంగంగానే బయట పెడుతుంటారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనని చంద్రబాబుకు చెప్పారన్న ప్రచారం కూడా జరిగింది. ఇటీవల చంద్రబాబు ఢిల్లీ వచ్చినప్పుడు విమానాశ్రయంలో ఆయన బొకే ఇచ్చేందుకు నిరాకరించడం వివాదంగా మారింది.

# విద్వేష రాజకీయాలకు తండ్రిని కోల్పోయాను.. దేశాన్ని కోల్పోను: రాహుల్ గాంధీ

చెన్నై: భారత్ జోడో యాత్రను ఇవాళ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రారంభించనున్నారు. కన్యాకుమారి నుంచి మెగా ర్యాలీ భారత్ జోడో యాత్ర ప్రారంభంకానున్నది. అయితే దానికి ముందు రాహుల్ గాంధీ ఇవాళ శ్రీపెరంబదూర్‌లో ఉన్న మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ స్మారకం వద్ద నివాళి అర్పించారు. విద్వేష, విభజన రాజకీయాలకు తన తండ్రి బలయ్యాడని, కానీ అటువంటి విద్వేష రాజకీయాలకు దేశాన్ని వదులుకోవడానికి సిద్ధంగా లేనని రాహుల్ ఇవాళ తన ట్విట్టర్‌లో తెలిపారు. ద్వేషాన్ని ప్రేమ జయిస్తుందని, భయాన్ని ఆశ జయిస్తుందని, కలిసికట్టుగా మనం అన్నింటిలో విజయం సాధిస్తామని రాహుల్ తన ట్వీట్‌లో వెల్లడించారు. 1991, మే 21వ తేదీన శ్రీపెరంబదూర్‌లో జరిగిన సూసైడ్ అటాక్‌లో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ మృతిచెందారు. లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిల్ ఈళం ఆ దాడికి పాల్పడింది.



# పేర్లు మార్చారే గానీ.. ప్రాజెక్టు ఒక్కటైనా కట్టారా? : దేవినేని ఉమ



విజయవాడ: మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం ప్రాజెక్టును ప్రారంభించిన తీరుపై టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో శంకుస్థాపనలు చేసిన ప్రాజెక్టులను తాము చేపడుతున్నట్లుగా వైఎస్ జగన్ సర్కార్ గొప్పలకు పోవడాన్ని దేవినేని ఉమ తీవ్రంగా ఆక్షేపించారు. కేవలం ప్రాజెక్టుల పేర్లు మార్చారే గానీ ఏ ఒక్క ప్రాజెక్టునైనా మీ ప్రభుత్వం కట్టిందా? అని ట్విట్టర్ వేదికగా ఆయన ప్రశ్నించారు.రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు చేపట్టిన ప్రాజెక్టులను జగన్ ప్రారంభిస్తున్నారని దేవినేని ఉమ విమర్శించారు. ప్రాజెక్టుల నిర్వహణ, నిర్మాణాలను ఈ ప్రభుత్వం భ్రష్టు పట్టిస్తుందని ఆయన విచారం వ్యక్తం చేశారు. సంగం బరాజ్ పనులను చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రత్యేక దృష్టి సారించి 82 శాతానికి పైగా పూర్తి చేశారని తెలిపారు. నెల్లూరు జిల్లాలో సాగు, తాగు నీటి అవసరాలను తీర్చాలన్న దూరదృష్టితో చంద్రబాబు సంగం బరాజ్ నిర్మాణానికి పూనుకున్న విషయం మర్చిపోయి వైసీపీ నేతలు మాట్లాడటం తగదన్నారు.వైసీపీ ప్రభుత్వం గడిచిన 40 నెలల కాలంలో 10 శాతం పనులు కూడా చేయకుండా రిబ్బన్ కటింగ్ చేశారని దేవినేని ఉమ సెటైర్ వేశారు. సంగం బరాజ్ పేరును మార్చడం తప్ప ఏం చేశారని నిలదీశారు. ఎవరి హయాంలో ఎంత ఖర్చు పెట్టారో చెప్పే ధైర్యం సీఎం జగన్‌కు ఉందా? అని దేవినేని ఉమ సవాల్ విసిరారు. ప్రజల అవసరాలను తీర్చకుండా ప్రభుత్వం కేవలం ప్రారంభోత్సవాలకే పరిమితమై పోయిందని విచారం వ్యక్తం చేశారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఏ ఒక్క కొత్త ప్రాజెక్టు చేపట్టారో వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు.

# సంపాదకీయం

**గురువారం 08-09-2022**

## హ్యాట్రిక్ కొట్టడమే లక్ష్యం

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి.. కేంద్రంలో హ్యాట్రిక్ కొట్టడమే లక్ష్యంగా బీజేపీ ఇప్పటినుంచే అడుగులు వేస్తోంది. ప్రతిపక్షాల అడుగులను గమనిస్తూ.. వాటిని తిప్పికొట్టేందుకు అవసరమైన వ్యూహరచనతో ముందుకెళ్తోంది. దీనిలో భాగంగా.. బీజేపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అగ్రనేతల కీలక సమావేశం జరిగింది. బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా, హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో జరిగిన ఈ సమావేశానికి 24 మంది కేంద్రమంత్రులు హాజరయ్యారు. మిషన్ 2024లో భాగంగా వ్యూహాలు, ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో కొద్ది తేడాతో ఓడిన 144 నియోజకవర్గాలపై ఫోకస్ పెట్టింది బీజేపీ హైకమాండ్. రాష్ట్రాలు, జిల్లాల వారిగా 144 సీట్లను గ్రూపులుగా విభజించి, కేంద్ర మంత్రులకు బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. పశ్చిమ బెంగాల్, తెలంగాణ, మహారాష్ట్ర, ఉత్తర్ ప్రదేశ్ సహా వివిధ రాష్ట్రాల్లో ఆయా పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఇప్పటికే బీజేపీ అగ్రనాయకులు పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో గెలుపు గుర్రాలను గుర్తించి నివేదికను సిద్ధం చేసినట్టు సమాచారం. మంత్రుల బృందం గుర్తించిన అంశాలు, లోపాలు, బలాలు, బలహీనతలపై సమావేశంలో లోతుగా సమీక్షించినట్లు తెలుస్తోంది. మంత్రులిచ్చిన సమాచారంతో విజయానికి బ్లూ-ప్రింట్ తయారు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఏయే రాష్ట్రాల్లో సీట్లు తగ్గుతాయి, తగ్గే సీట్లను ఏయే రాష్ట్రాల్లో భర్తీ చేయవచ్చనే పక్కా వ్యూహంతో బీజేపీ ముందుకెళ్తోంది. 2019లో పార్టీ స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయిన సీట్లలో గట్టి వ్యూహాలను అవలంభించాలని బీజేపీ చీఫ్ జేపీ నడ్డా, హోంమంత్రి అమిత్ షా దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. గతం కంటే ఈ సారి ఎక్కువ సీట్లు గెలవాలని.. 2024 ఎన్నికల్లో 2019లో ఓడిపోయిన సీట్లలో 50 శాతం గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అమిత్ షా చెప్పినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.2019లో 543 లోక్‌సభ స్థానాలకు గాను 303 స్థానాలను బీజేపీ గెలుచుకుంది. దశాబ్దాల తర్వాత తొలిసారిగా ఒక పార్టీకి సొంతంగా భారీ మెజారిటీ వచ్చింది. అయితే.. 100 సీట్లకు పైగా విపక్షాలు గెలుపొందగా, కాంగ్రెస్‌కు అత్యధికంగా 53 సీట్లు వచ్చాయి.తెలంగాణపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది భారతీయ జనతా పార్టీ.. టీఆర్ఎస్‌కు అసలైన ప్రత్యామ్నాయం తామేనని.. వచ్చే ఎన్నికల్లో విజయం మాదేనని బల్లగుద్ది చెబుతున్నారు ఆ పార్టీ నేతలు.. నాగార్జున సాగర్ మినహా.. వరుసగా ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించడంతో.. క్రమంగా తమ గ్రాఫ్ పెరుగుతుంది అంటున్నారు. కాషాయం పార్టీ అగ్రనేతలు వరుసగా తెలంగాణను చుట్టేస్తున్నారు.. హైదరాబాద్ వేదికగా జాతీయ కార్యవర్గ సమావేశాలను నిర్వహించి.. ఆ తర్వాత భారీ బహిరంగ సభతో ప్రధాని నరేంద్ర మోడీ నుంచి కూడా ప్రశంసలు అందుకున్నారు బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్.. ఇక, బీజేపీ నేతల కన్ను ఇప్పుడు సినీ పరిశ్రమపై పడింది.. వరుసగా సినీ నటులతో పార్టీ అగ్రనేతలు సమావేశం అవుతుండడంతో.. అసలు బీజేపీ ప్లాన్ ఏంటి? అనే చర్చ సాగుతోంది. టాలీవుడ్ ప్రముఖులతో వరుసగా బీజేపీ అగ్రనేతలు భేటీ కావడం చర్చగా మారుతోంది.. జూనియర్ ఎన్టీఆర్ ట్రిపుల్ ఆర్ సినిమాలో కొమురం భీం పాత్ర పోషించి మెప్పించారు.. ఆర్ఆర్ఆర్ సినిమా చూసిన అమిత్‌షా.. ఎన్టీఆర్‌ను ప్రశంసించేందుకే సమావేశం అయ్యారని బీజేపీ నేతలు చెబుతున్నారు. ఈ భేటీలో సీనియర్ ఎన్టీఆర్ గురించి కూడా చర్చ జరిగిందట.. ఎంతైనా ఎన్టీఆర్ విషయం వేరు అనుకోవచ్చు.. రాజకీయ నేపథ్యం ఉన్న ఫ్యామిలీ కాబట్టి.. రాజకీయాలు కూడా చర్చించి ఉంటారు? పాలిటిక్స్‌లో ఏమైనా జరగొచ్చు? అనే చర్చ ఆసక్తిగా సాగుతుంది.. ఇక, ఇప్పుడు మరో టాలీవుడ్ హీరోతో భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది.. తెలంగాణ నుంచి టాలీవుడ్‌లో నిలదొక్కుకున్న హీరో నితిన్‌తో భేటీకి రెడీ అయ్యారు కమలం పార్టీ చీఫ్.. తెలంగాణ నుంచి సినీ పరిశ్రమలో నిర్మాతలు, దర్శకులు, నటులు ఉన్నా.. హీరోగా నిలదొక్కుకున్నారు నితిన్.. తెలంగాణపై ప్రత్యేకంగా దృష్టిసారించిన ఆ పార్టీ.. అందుకే నితిన్‌ని ఎంచుకున్నట్టు చర్చ సాగుతోంది. ఆర్ఆర్ఆర్ సినిమా చూసి ఎన్టీఆర్ నటకు ఫిదా అయిన షా.. అభినందించడానికే జూనియర్‌తో భేటీ అయ్యారు.. సరే.. మరి.. వరుసగా అంతరేజ్ హిట్లు లేని నితిన్‌ని ఎందుకు కలుస్తున్నారు..? నితిన్‌ను నటించిన తాజా చిత్రం మాచర్ల నియోజకవర్గం ఫ్లాప్ టాక్ తెచ్చుకుంది.. అయినా జేపీ నడ్డా ఎందుకు కలుస్తున్నారు? అనే ప్రశ్నించేవారు లేకపోలేదు. సినీ పరిశ్రమ వారికి పార్టీ కండువాలు కప్పడం, వారితో సమావేశమై.. వారు కూడా మాతోనే ఉన్నారనే సంకేతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం భారతీయ జనతా పార్టీ నేతల ప్లాన్‌గా అంచనా వేస్తున్నారు రాజకీయ విశ్లేషకులు.. అంతే కాదు.. ఈ మధ్యే ప్రముఖ రచయిత, ఎస్ఎస్ రాజమౌళి తండ్రి విజయేంద్ర ప్రసాద్‌ను రాజ్యసభలో కూర్చోబెట్టి గౌరవించింది బీజేపీ.. ఇప్పుడు.. టాలీవుడ్ ప్రముఖులతో బీజేపీ అగ్ర నేతలు భేటీ అయ్యేలా.. ఆయనే ప్లాన్ చేస్తున్నారనే ప్రచారం కూడా లేకపోలేదు. ముఖ్యంగా బీహార్ సీఎం, జేడీయూ నేత నితీష్ కుమార్ ఢిల్లీ పర్యటనలో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ తో పాటు వామపక్ష అగ్రనేతలను కలుసుకున్నారు. ఇదే సమయంలో బీజేపీ అగ్రనాయకులు ఢిల్లీలో సమావేశమై తాజా రాజకీయాలతో పాటు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అవలంభించాల్సిన వ్యూహాలపై చర్చించినట్లు తెలుస్తోంది. వీటితో పాటు గుజరాత్, హిమచల్ ప్రదేశ్ లో ఈఏడాది చివరిలో శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. ముఖ్యంగా ఈఎన్నికలపై కూడా ఈసమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. బీజేపీ అగ్రనాయకుల కీలక సమావేశంలో ఎటువంటి అంశాలు చర్చించారనేదానిపై అధికారికంగా ఎటువంటి ప్రకటన వెలువడలేదు.

## కేసులతో సమస్య పరిష్కారమా

విజయవాడ, సెప్టెంబర్ 7, సీపీఎస్ ఉద్యోగ సంఘ నేతలను కేసులతో భయపెట్టి సమస్యకు పరిష్కారం చూపాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. చర్చల్లో ఎలాంటి పురోగతి ఉండదని తెలిసినా బొత్స, బుగ్గన నేతృత్వంలోని కమిటీ తరచూ ఉద్యోగ సంఘ నేతలను చర్చలకు పిలుస్తున్నారు. వారు అడుగుతున్నట్లుగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేయబోమని.. జీపీఎస్ అమలు చేస్తామని అంగీకరించాలని పట్టుబడుతున్నారు. సీపీఎస్ రద్దుపై మాత్రమే చర్చలకు వస్తామని వారు ఖరాఖండిగా తేల్చి చెప్పి బయటకు వచ్చేశారు. కానీ ఈ మీటింగ్‌ల వెనుక వేరే వ్యూహం ఉందని అధికారవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం రేపు కేబినెట్ సమావేశం నిర్వహించబోతోంది. ఇందులో సీపీఎస్‌కు బదులుగా అమలు చేయాలనుకుంటున్న జీపీఎస్‌కు ఆమోద ముద్ర వేసి.. వెంటనే అసెంబ్లీలో ఆమోదించాలనుకుంటున్నారు. అదే జరిగితే ఉద్యోగులు శాశ్వతంగా నష్టపోతారు. ఇలా చేయడానికే ఉద్యోగ సంఘాల నేతలపై కేసు కత్తి వేలాడదీశారు. ఇటీవల ఎవరూ చలో విజయవాడకు రాకపోయినా.. ఉద్యోగ సంఘాల నేతలందరిపై కుట్ర కేసులు పెట్టారు. దీంతో వారందరికీ అరెస్టులు తప్పవని హెచ్చరికలు జారీ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. తమపై పెట్టిన తప్పుడు కేసులు తొలగించాలని వారు కోరుతున్నారు. డీజీపీని కలుస్తామని చెబుతున్నారు. అయితే ఆ కేసులు తీసేయాలంటే.. సీపీఎస్ రద్దు డిమాండ్ చేయకూడదని.. జీపీఎస్ కు అంగీకరించాలని షరతును పరోక్షంగా పంపుతున్నట్లుగా తెలుస్తోంది. దీనిపై ఉద్యోగ సంఘాల నేతలు లొంగిపోతే.. ప్రభుత్వం చిన్న చిన్న నిరసనలతో అనుకున్నట్లుగా జీపీఎస్ అమలు చేసేస్తుంది.

చర్చల్లేవంటున్న మంత్రి

ప్రస్తుతానికి పరిస్థితులను అర్థంచేసుకుని జీపీఎస్‌ను అంగీకరించాలని ఏపీ మంత్రులు బొగ్గన, బొత్స సీపీఎస్ నాయకులను కోరారు. కానీ ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించమని వారు తెగేసి చెప్పారు. జీపీఎస్ సంబంధించి చాలారోజులుగా నలుగుతున్న సమస్యను పరిష్కరించేందుకు మంగళ వారం ఉద్యోగ సంఘాల నాయకులతో ఏపీ మంత్రులు చర్చకు మరోసారి ఆహ్వానించారు. కానీ వారి చర్చ లు విఫల మయ్యాయి. పాత పెన్షన్‌పై చర్చిద్దాం అన్న మీదటే చర్చలకు వచ్చామని తెలిపారు. సీపీఎస్‌లో గవర్నమెంట్ షేర్ ఈ రోజుకు ఇవ్వడం లేద న్నారు. పిలిచి మరలా జీపీఎస్ గురించే మాట్లాడుతున్నారని.. ఇకపై అసలు చర్చలకు పిలవవద్దు అని చెప్పామని అన్నారు.వేలాది మంది ఏపీసీపీఎస్‌యూఎస్ నాయకులు, టీచర్‌లపై కేసులు నమోదు చేశా రని మండిపడ్డారు. అక్రమ కేసులను రద్దు చేయాలని కోరామన్నారు. డీజీపీని కలిసి కేసులు ఎత్తి వేయా లని కోరనున్నట్లు చెప్పారు. అక్రమ కేసులు పెట్టినందున మంత్రులు బొత్స, బుగ్గనలకు వినతి పత్రం ఇచ్చామని దాసు తెలిపారు. ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్షులు అప్పలరాజు మాట్లాడుతూ మరో మిలియన్ మార్చ్ ద్వారా సీపీఎస్ మహమ్మారిని తరిమి కొట్టాలని బావించామన్నారు. గత ఏడేళ్లలో పోలీసుల అనుమతి లేకపోతే ఏ కార్య క్రమం చేయలేదని తెలిపారు. సీఎం ఇల్లు ముట్టడి నెప్పాన్ని చూపి తమకు సంబంధం లేకపోయినా కేసులు పెట్టారని మండిపడ్డారు. జిల్లా ప్రెసిడెంట్‌ను తీసుకు వెళ్లి కేసులు పెట్టారన్నారు. నిజానికి ఆరోజు స్కూల్‌లో ఉన్న నాపై సీఎం ఇంటిని ముట్టడికి కుట్రచేశానంటూ కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశా రు.ఈ కేసులను వెంటనే తొలగించాలని బొత్సను కోరామన్నారు. సెప్టెంబర్ 11న మిలియన్ మార్చ్, చలో విజయవాడ కార్యక్రమానికి అనుమతి ఇస్తే చేస్తాము లేకపోతే మరల వాయిదా వేస్తామని అప్పలరాజు వెల్లడించారు.

## ఢిల్లీ నుంచి పిలుపు కష్టమేనా

విజయవాడ, సెప్టెంబర్ 7,అప్పుడే నెల గడిచింది. ఢిల్లీ నుంచి పిలుపు రాలేదా? మళ్లీ మొదటికొచ్చిందా? గత నెల ఆరోతేదీన చంద్రబాబు మోదీ తో భేటీ అయ్యారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కమిటీ సమావేశంలో చంద్రబాబుతో మోడీ కరచాలనం చేశారు. ఐదు నిమిషాలు మాట్లాడారు. ఢిల్లీ రావాలని ఆహ్వానించారు. ఎప్పుడు వచ్చినా పీఎంవోకు చెబితే చాలు అపాయింట్‌మెంట్ ఇస్తారని మోదీ అన్నట్లు వార్తలు వచ్చాయి. తాను కూడా చాలా విషయాలు మాట్లాడాలనుకుంటున్నట్లు చంద్రబాబు మోదీతో అన్నట్లు ప్రచారమూ సాగింది దీంతో చంద్రబాబు, మోదీ భేటీ త్వరలో జరగనుందని అందరూ భావించారు దీనికి తోడు కేంద్ర హోంమంత్రి అమిత్ షా వచ్చి ఈనాడు సంస్థల అధినేత రామోజీరావును కలవడం, ఆ తర్వాత జూనియర్ ఎన్టీఆర్ తో భేటీ కావడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. నారా లోకేష్ కూడా ఢిల్లీలో అమిత్ షాను కలిశారని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. బీజేపీతో పొత్తు కుదిరినట్లేనని టీడీపీ అనుకూల మీడియాలో కూడా వార్తలు వచ్చాయి. జాతీయ మీడియాలో కూడా కథనాలు ప్రచురితమయ్యాయి. అయితే ఇంతవరకూ చంద్రబాబు హస్తిన పర్యటనకు బయలుదేరకపోవడం కూడా పార్టీలో చర్చనీయాంశంగా మారింది.నిజానికి చంద్రబాబుకు ఏ మాత్రం అవకాశం ఉన్నా మోదీతో భేటీకి సిద్ధపడతారు. ఇది అందరికీ తెలిసిన విషయమే. ఆయన పార్టీ ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వంలో కేసుల సమస్యను ఎదుర్కొంటోంది. దాని నుంచి బయటపడాలంటే కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం. అందుకే నిజంగా మోదీ ఢిల్లీకి ఆహ్వానం పలికి ఉంటే పది రోజుల తర్వాతనైనా ఆయన ఢిల్లీ బయలుదేరి వెళ్లేవారు. బీజేపీ నేతలకు కూడా టీడీపీతో పొత్తు పెట్టుకోవాలని గట్టిగా భావిస్తే అటు నుంచి అయినా ఆహ్వానం అందేది. కానీ అటు నుంచి పిలుపులు లేవు. ఇటు నుంచి ప్రయత్నాలు లేవు. తెలంగాణలో ఎన్నికల కోసం బీజేపీ టీడీపీతో పొత్తు కుదుర్చుకుంటుందన్న ప్రచారమూ జరిగింది. బీజేపీ తెలంగాణ నేతలు దీనిని కొట్టిపారేశారు. ఇటు చంద్రబాబు కూడా దీనిపై స్పందించడానికి నిరాకరించారు. ఆయన హస్తిన ప్రయాణం కోసం తెలుగుదేశం పార్టీ నేతలు ఎదురు చూస్తున్నా ఫలితం లేకుండా ఉంది. చంద్రబాబు కూడా పొత్తులు గురించి ఆలోచించకుండా ముందు పార్టీ బలోపేతంపైనే దృష్టి సారించాలని పార్టీ నేతలకు పదే పదే పిలుపు నిస్తున్నారు. దీన్ని బట్టి చంద్రబాబు హస్తిన ప్రయాణం ఇప్పట్లో జరుగుతుందా? లేదా? అన్న చర్చ పార్టీలో చర్చ జరుగుతోంది. అసలు బీజేపీతో పొత్తు కుదురుతుందా? మోదీ షేక్ హ్యాండ్ కు ఫలితం దక్కదా అన్న నిరాశ తెలుగు తమ్ముళ్లలో స్పష్టంగా కనపడుతుంది

## క్రైమ్ సిటీగా మారుతున్న విశాఖ



విశాఖపట్టణం, సెప్టెంబర్ 7, వైజాగ్‌లో భారీగా మత్తు ట్యాబ్లెట్లు స్వాధీనం.. నెల్లూరు జిల్లాలో బాలికపై ఘాతుకం.. ఇవి రెండూ మంగళవారం పత్రికలో వచ్చిన రెండు వేర్వేరు వార్తలు. అయితే, కొంచెం లోతుల్లోకి వెళ్లి చూస్తే, ఈ రెండు ఘాతుక వార్తలకు సంబంధం ఉండడమే కాదు, రెంటి మూలం, ఒకటే, అదే మత్తు. అవును, అది మద్యం అయినా, డ్రగ్స్ అయినా, గంజాయి, ఇప్పుడు ఈ టాబ్లెట్స్ ఏదైనా సమాజమలో నేరాలు ఘోరాలు రోజు రోజుకు పెరిగి పోవడానికి, మద్యం, మత్తు మూల కారణంగా అనేక అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. నిజం. మద్యంకానీ,మత్తు పదార్ధాలు, మాదక ద్రవ్యాలకు ఒకసారి అలవాటు పడితే .. ఇక ఆ మత్తులోంచి బయటకు రావడం ఎంతటివారికి అయినా అంట సులభంగా అయ్యే పనికాదు. ఇక యువత విషయం అయితే చెప్పనే అక్కర లేదు. అందుకే యువత మత్తు మందులకు అలవాటు పడితే,అది వ్యక్తులు కుటుంబాలను పీల్చిపీల్చి పీల్చి పిప్పిచేస్తుంది. అంతేకాదు, సమాజాన్ని నిర్వీర్యం చేస్తుందని, సామాజిక శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్నారు. మరో వంక జాతీయ, అంతర్జాతీయ సంఘ వ్యతిరేక శక్తులు సమాజాన్ని నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా యువతకు మత్తు మందులను ఎరగావేస్తున్నాయి. ముంబై లాంటి నగరాలో మత్తు మందులు, మాదక ద్రవ్యాల ద్వారా నేర సామ్రాజ్యాని విస్తరించుకునే కుట్రలు కోకొల్లలుగా వెలుగులోకి వచ్చాయి. వస్తున్నాయి.అందుకే, విశాఖ నగరంలో నగరంలో యువతను లక్ష్యంగా చేసుకుని మత్తు కలిగించే ట్యాబ్లెట్లను విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన అనేక అనుమానాలకు తావిచ్చేలా ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ ముఠా ఒడిశా, పశ్చిమబెంగాల్ వంటి ప్రాంతాల నుంచి పెద్ద మొత్తంలో మత్తును కలిగించే ట్యాబ్లెట్లు దిగుమతి చేసుకుంటున్నట్లు వచ్చిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ యాంటీ నార్కోటెక్ విభాగం ఆధ్వర్యంలో నిఘా పెట్టారు. కంచరపాలెంకు చెందిన ఏడుగురు సభ్యుల ముఠాను గుర్తించి అరెస్టు చేశారు. వీరిలో ఒక మహిళ కూడా ఉండటం విశేషం. వీరి నుంచి మూడు కంపెనీలకు చెందిన 8వేల మత్తు కలిగించే ట్యాబ్లెట్లు, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.మరోవంక దేశంశంలో జరిగే హత్యలు, మానభంగాలు భంగాలు మరెన్నో నేరాలకు మద్యం, మత్తు మందులే కారణం అవుతున్నాయి. ఒక్క నేరాలు ఘోరాలే కాదు, కుటుంబ కలహాలు, రోడ్డు ప్రమాదాలు మిగిలిస్తున్న విషాద ఘటనలు అన్నిటికీ, మద్యం మత్తుమందులే కారణం అని వేరే చెప్పనక్కరలేదు. ప్రతి నిత్యం జరుగతున్న అలాంటి దుర్మార్గ సంఘటనలు ఎన్నో మన కళ్ళముందే కనిపిస్తున్నాయి. అవును మత్తు మందుకు బానిసైన బతుకులు ఏ విధంగా తెల్లారుతున్నాయో చస్తూనే ఉన్నాం. విచక్షణా రహితంగా వావి వరసలు లేని అఘాయిత్యాలకు, ఆకృత్యాలకు పాల్పడుతున్న వారిని నేరాలకు ఇంకా ఇతర కారణలు ఉన్నా, మద్యం మత్తు నేరాలకు ఒక ప్రధాన కారణంగా అనేక అధ్యయనాలు స్పష్టం చేశాయిఅందుకే ఈరోజు మనం ముక్కు పచ్చలారని పసి కందులపై అత్యాచారానికి పాల్పడుతున్న మానవ మృగాలను చూస్తున్నాం. ఎక్కడివరకో ఎందుకు నెల్లూరులో ఇంట్లో ఒంటరిగా ఉన్న 14 ఏళ్ల బాలికపై అత్యాచారానికి ప్రయత్నించి ఆమె ప్రతిఘటించడంతో కిరాతకంగా ఆమె నోట్లో, ముఖంపై యాసిడ్ పోసి.. ఆపై గొంతు కోసి పరారైన సంఘటనే మత్తు మహమ్మారి ఘాతుక చరిత్రను కళ్ళకు కట్టినట్లు చూపుతోంది . ఇలాంటి నేరాలు ప్రతి రోజు ఎక్కడో అక్కడ జరుగుతనే ఉన్నాయి. ప్రత్యేకించి నెల్లూరు దుర్ఘటన అనే కాదు, సహజంగా ఇలాంటి నేరాలకు మద్యం మత్తే మూల కారణం అవుతోంది. అయినా ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. ముఖ్యంగా వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో గంజాయి అక్రమ రవాణా విచ్చలవిడిగా సాగుతోందనే ఆరోపణలు కాదు వాస్తవ సంఘటనలే వెలుగు చూసాయి. ఎక్కడో గుజరాత్, పొరుగున ఉన్న తెలంగాణలో పట్టుబడిన గంజాయి అక్రమ వ్యాపారం మూలాలు ఆంధ్ర ప్రదేశ్లో బయట పడ్డాయి. అలాగే, డ్రగ్స్, మాదక ద్రవ్యాలు ఇలా ఒకటని కాదు, ఇప్పుడు కొత్తగా వెలుగు చూసిన మత్తు టాబ్లెట్స్ దందా వరకు ప్రతి అక్రమ దందాకు ఏపీ అడ్డగా మారింది. ఇక మద్యం సంగతి అయితే చెప్పనే అక్కరలేదు. అంచెల వారీగా మద్య నిషేధం అమలు చేస్తామని, అక్క చెల్లెమ్మలకు, అమ్మలకు, అవ్వలకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్ రెడ్డి, మద్యమే ములాధరంగా పరిపాలన సాగిస్తున్నారు. అంతే కాదు పాతికేళ్ల మద్యం ఆదాయాన్ని పూచికత్తుగా చూపించి అప్పు కూడా తెచ్చుకున్నారు. అందుకే, ఏపీలో ఇప్పుడు సగటున రోజుకు మూడు అత్యాచార ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. రాష్ట్రంలో నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయి. నాలుగైదేళ్ల కిందట వరకూ అతి తక్కువ నేరాల రేటు కలిగిన రాష్ట్రాల జాబితాలో కొనసాగిన ఏపీ.. ఇప్పుడు అత్యధిక నేరాల రేటు కలిగిన రాష్ట్రాల సరసన చేరింది

## పులి కాదు చిరుత

విజయనగరం, సెప్టెంబర్ 7, విజయనగరం జిల్లా రాజం మండలం భయం గుప్పిట్లో ఉంది. పెద్దపులి సంచరిస్తుండడంతో ప్రజలు ప్రాణ భయంతో వణికిపోతున్నారు. ఇప్పటికే పులి పాదముద్రల్ని గుర్తించిన ఫారెస్ట్ అధికారులు.. మొగిలివలస, పొగిరి, అంతకాపల్లి, పొనిగిటివలస గ్రామస్తులను అప్రమత్తం చేశారు. ఎవరూ ఒంటరిగా బయటకు వెళ్లొద్దని.. అవసరం అయితే ఎవరినైనా వెంట బెట్టుకెళ్లాలని దండోరా వేయించారు. ప్రజలంతా సాయంత్రం కల్లా ఇళ్లకు చేరాలన్నారు. ఈ ప్రాంతాల్లో సంచరిస్తోంది రాయల్ బెంగాల్ టైగరేనని అనుమానిస్తున్నారు.ఇదిలా ఉంటే ఈ ప్రాంతాల్లో కేవలం పులి మాత్రమే కాకుండా చిరుత కూడా సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. అంతకాపల్లి పంటపొలాల్లో పాదముద్రలు సేకరించిన ఫారెస్ట్ సిబ్బంది.. బెంగాల్ రాయల్ టైగర్‌తో పాటు చిరుత కూడా తిరుగుతుందనే అనుమానాలు వ్యక్తం చేశారు. దీంతో చుట్టుపక్కల పది గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. నెలరోజులకి పైగా చిక్కకుండా దొరక్కుండా తిరుగుతున్న పెద్దపులి మూగజీవాలపై పంజా విసురుతూనే ఉంది.ఈ మధ్య బొండపల్లి మండలం కర్రివాని వలసలో ఆవుపై దాడి హతమార్చింది. అంతకుముందు దత్తిరాజేరు మండలం యన్. చింతలవలసలో కూడా పులి ఆనవాళ్లు కనిపించాయి. అయితే పులి లేదంటే చిరుత సంచారంతో స్థానికులు ప్రాణభయంతో వణికిపోతున్నారు. సాధ్యమైనంత త్వరగా వాటిని బంధించాలని అధికారులను కోరుతున్నారు.

## దారిమళ్లుతున్న పంచాయతీ నిధులు

కర్నూలు, సెప్టెంబర్ 7, అభివృద్ధి చెందాలి అంటూ భారీ నినాదాలు చేస్తూనే పంచాయితీలకు ఇవ్వాల్సిన నిధులను తొక్కి పెడితే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది? ఏపీలో పంచాయితీలలో వినపడుతున్న ప్రధాన ప్రశ్న ఇదే. పంచాయితీ అధికారులకు చేతిలో చిల్లి గవ్వలేకుండా ముందడుగు వేయమంటే ఎలా వెళ్లగలరో సీఎం చెప్పాలని అంటున్నారు. గ్రామాల్లో కనీసం రోడ్డు బాగుచేసుకోవడానికి కూడా నిధులు లేకపోవడం మరీ విడ్డూరంగా మారింది. కేవలం ప్రచారాలకు ప్రాధాన్యతనిస్తూనే సీఎం, ఎమ్మెల్యేలు కాలం గడిపేస్తు న్నారేగాని పంచాయితీలకు నిధులను అందజేయడం విషయంలో మాత్రం మౌనం వహించడం గమనా ర్హం. గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌ల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామంటూన్నారు గాని ఖాతాలన్నీ ఖాళీ యే అని సర్పంచ్‌లు అంటున్నారు. చివరికి డబ్బులు లేక.... పనులు చేయలేక... ప్రజల్లోకి వెళ్లలేని పరి స్థితుల్లో సర్పంచ్‌లు ఉన్నారు.ప్రభుత్వం నుంచి పంచాయతీలకు వివిధపద్దుల కింద రావాల్సిన నిధులు ఈ ఏడాదిలో ఇంకా విడు దల కాలేదు. రూ.4 చొప్పున ఇవ్వాల్సిన తలసరి గ్రాంటు, భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్లపై స్టాంపు డ్యూటీ వాటా తదితర పన్నులు పంచాయతీలకు ఈ ఆర్థిక సంవత్సరంలో జమ కాలేదు. 3, 4 రాష్ట్ర ఆర్థిక సంఘా లు సిఫారసు చేసిన నిధులనూ రాష్ట్ర ప్రభుత్వం కేటాయించలేదు.కర్నూలు జిల్లాలోని 484 గ్రామ పంచాయతీల్లో 15.11 లక్షల జనాభా ఉంది. గత ఏడాది చివర్లో మొత్తం పంచాయతీ ఖాతాల్లోని నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఖాళీ చేసింది. దీంతోపాటు మార్చి 31న పంచాయతీ ఖాతాల్లోని జనరల్ ఫండ్‌ను కూడా రాష్ట్ర ప్రభుత్వం మాయం చేసింది. ఇలా ఉమ్మడి జిల్లాలోని పంచాయతీల నుంచి రూ.కోట్లు ఖాళీ చేసేసింది. మార్చి 31న ఖాతాల్లో ఉన్న నిధులు ఏప్రిల్ ఒకటో తేదీకి కని పించకుండా పోయేసరికి సర్పంచులు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేశారు. దీంతో ప్రభుత్వం తీసుకు న్న జనరల్ ఫండ్‌ను పది రోజుల్లో వెనక్కి ఇచ్చేసింది. పంచాయతీ ఖాతాల్లోని సొమ్ములను రాష్ట్ర ప్రభు త్వం వెనక్కి లాగేస్తుండడంతో అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం నేరుగా పంచాయతీలకు నిధులు అందించేలా చర్యలు తీసుకుంది. ఉమ్మడి జిల్లాలోని 973 పంచాయతీలూ కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఈ-గ్రామస్వరాజ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకుని, ప్రత్యేక బ్యాంకు ఖాతాలు తెరిచాయి. ఇక నుంచి ఆ ఖాతాలకే కేంద్రం ఆర్థిక సంఘం నిధులు నేరుగా జమ కానున్నాయి.ఏపీలో అనేక గ్రామపంచాయితీల సర్పంచ్‌లు గ్రామాల్లో పనులు చేయడానికి నిధుల కొరతతో పనులు ఆగిపోయాయి. దీంతో ప్రజల్లోకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని వారే వాపోతున్నారు. సీఎం, ఎమ్మెల్యేలకు ఈ సంగతి తెలిసినా బొత్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల సర్పంచ్‌లు తమ ఇబ్బందులు చెప్పుకోలే ని స్థితిలో ఉండిపోయారు. తమ పాచంయతీ ఖాతాలోని ఆర్థికసంఘం నిధులను ప్రభుత్వం వెనక్కి తీసు కుంది. పంచాయితీలో అభివృద్ధి పనులు నిలిచిపోయి ప్రజల ముందుకు వెళ్లలేకపోతున్నామని సర్పంచ్లు వాపోతున్నారు. చాలా పంచాయితీల్లో చేసినపనులకు బిల్లులు రాక సర్పంచ్‌లు ఇబ్బంది పడుతు న్నారు. ఏపీలో దాదాపు అన్ని గ్రామపంచాయితీల్లోనూ పరిస్థితులు ఇలానే ఉన్నాయనే అభిప్రాయాలే వ్యక్తమవు తున్నాయి. ఈ కారణంగా ప్రజలు ప్రభుత్వం తీరును ఎండగడుతున్నారు. ఈ భయంతోనే ఎమ్మెల్యేలు, సర్పంచ్‌లు సైతం గ్రామాల్లో తిరగడానికి వెళ్లి అవమానాలపాలవుతున్నారు. ఇటీవలి గడపగడపకు కార్యక్రమంలో జరిగిన సంఘటనలే అందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి.

## ఓ వైపు వరదలు.. మరో వైపు కరువు

అనంతపురం, సెప్టెంబర్ 7, ఖరీఫ్ వరి సాగు సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడిచినా రైతులకు సాగు నీరు ఇబ్బందులు తప్పడం లేదు. తోటపల్లి ప్రాజెక్టు నుంచి గత రెండు సంవత్సరాలుగా సాగునీరందక రైతులు ఇబ్బందులు పడుతుంటే, గడిగెడ్డలో నీరు ఎక్కువై వృధాగా పోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఫలితంగా అక్కడ కూడా రైతులకు నీరు సక్రమంగా అందడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఒకచోట నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే మరోచోట నీరుండీ సక్రమంగా పొలాలకు అందడం లేదని ఇబ్బందులు పడుతున్నారు. వెరసి రెండు చోట్లా రైతులకు నీటి కష్టాలు తప్పడం లేదు. అధికారులు దీనిపై దృష్టి సారించాల్సి ఉంది. తోటపల్లి ప్రాజెక్ట్ నుండి చీపురుపల్లి నియోజకవర్గ పరిధిలోని 25,100 ఎకరాలకు సాగునీరు అందించడం జరుగుతుందని, ప్రజాప్రతినిధులు, అధికారులు సభలు, సమావేశాలలో చెప్పారు. కానీ ఇంత వరకూ తోటపల్లి కాలువలు నుండి పూర్తిస్థాయిలో సాగునీరు అందలేదు. గత ప్రభుత్వం పరిపాలనలో రెండు, మూడు సంవత్సరాలు సాగునీరు కొంత వరకు సరఫరా చేశారు. గడిచిన ఖరీఫ్, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు అందక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తోటపల్లి నీరు కోసం ఈ సంవత్సరం ప్రజాప్రతినిధులు, అధికారులు కనీసం పట్టించుకోలేదని వల్లాపురం, నాగళ్లవలస, తాటిపూడి, గొలగాం, రాగోలు గ్రామాల రైతులు అంటున్నారు. తోటపల్లి నుండి సాగు నీరును అ దించాలని రైతులు కోరుతున్నారు. రైతు ప్రభుత్వం అంటూ చెబుతున్న పాలకులు రైతులు గురించి పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తోటపల్లి డిఇ వివరణ కోరగా వారం రోజుల్లో తోటపల్లి నీరు గుర్ల మండలానికి వస్తుందని తెలిపారు.మండలంలో గడిగెడ్డ రిజర్వాయర్‌లో నీరు పుష్కరలంగా ఉంది. అయితే కుడి కాలువకు సంబంధించి బూర్లపేట సుమీపంలో కాలువ పై నుంచి నీరు పొంగి పైకి ప్రవహించడంతో సాగునీరు వృధాగా పోతుంది. కాలువలో మట్టి పేరుకపోవడం, పిచ్చి మొక్కలు ఉండడంతో నీరు ప్రవాహానికి అడ్డంకిగా మారి నీరు సరఫరా సక్రమంగా జరగడం లేదు. వేసవిలో కాలువలో ఉన్న మట్టి, పిచ్చి మొక్కలను తొలగించక పోవడంతో ఈ పరిస్థితి వచ్చిందని రైతులు అంటున్నారు. ఎడమ కాలువకు శివారు ప్రాంతాలైన పాలవలస, గూడెం, పునపరెడ్డిపేట గ్రామాల కు కూడా సాగునీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు.

# పొత్తులపై నేతల్లో టెన్షన్

విశాఖపట్టణం, సెప్టెంబర్ 7, ఉత్తరాంధ్రలో ఎక్కువ సీట్లు సాధించిన పార్టీదే అధికారపీఠం అనేది ఓ అంచనా. చాలాసార్లు ఈ లెక్కలే నిజం అవుతూ వస్తున్నాయి. ఉమ్మడి శ్రీకాకుళం, విశాఖ, విజయనగరం జిల్లాల్లో మొత్తం 34 స్థానాలు ఉన్నాయి. గత ఎన్నికల్లో ఉత్తరాంధ్ర నాడిని గట్టిగా పట్టేసింది వైసీపీ. టీడీపీ కంచుకోటలు బద్ధలయ్యాయి. సీనియర్ నాయకులకూ ఓటమి తప్పలేదు. కేవలం ఆరంటే ఆరు చోట్లే టీడీపీ గెలిచింది. పార్టీని నడిపించే నాయకత్వ లోపం ప్రతిపక్షానికి పెద్ద సమస్యగా మారింది. దీంతో నియోజకవర్గాల వారీగా సమీక్షలు చేసి గెలిచే వాళ్లను గుర్తించే పనిలో నిమగ్నమైంది హైకమాండ్. ఎన్నికలకు ముందుగానే టికెట్లపై ఓ అంచనాకు వస్తున్నారట.గాజువాక, అనకాపల్లి అభ్యర్థులకు దాదాపు టికెట్లు ఖరారు చేసినట్టు తెలుస్తోంది. మాజీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాస్, పీలా గోవింద్‌లకు క్లారిటీ ఇచ్చేశారని సమాచారం. దీంతో టికెట్స్ ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలకు టెన్షన్ పట్టుకుందట. తమకు అవకాశం వస్తుందో రాదోననే లెక్కలు వేసుకుని లోపాయికారీ ప్రయత్నాలు ప్రారంభించారట. 2019 ఎన్నికల తర్వాత చాలా మంది పార్టీ ఫిరాయించారు. అయ్యన్న, బండారు, కొందరు మాజీ ఎమ్మెల్యేలు మాత్రమే పోరాడుతున్నా.. ఆశించిన మైలేజ్ రావడం లేదనే వాదన ఉంది. ఇప్పుడు ఎన్నికల వేడి రాజుకోవడంతో.. సమాంతరంగా పొత్తులపైనా పార్టీలో చర్చ నడుస్తోంది. జనసేనతో పొత్తు కుదిరితే ఎవరి సీటుకు ఎసరొస్తుందో అని లెక్కలేసుకుంటున్నారు నేతలు.విశాఖ జిల్లాకు చెందిన కొందరు మాజీలు.. పార్టీ ముఖ్యులను గుడులు, గోపురాలకు తీసుకెళ్లి తమ మనసులో మాట బయట పెడుతున్నారట. గ్రేటర్ విశాఖ పరిధిలోని తూర్పు, ఉత్తరం, పశ్చిమ నియోజకవర్గాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్నారు. గంటా శ్రీనివాస్ ఈసారి భీమిలి వెళ్తారనే ప్రచారం ఉంది. నర్సీపట్నం, పెందుర్తి, పాయకరావుపేట సీట్లపై క్లారిటీ రావాల్సి ఉంది. మాడుగుల, యలమంచిలి, చోడవరంలోని టీడీపీ ఇంఛార్జుల్లో ఒకరిద్దరికి టికెట్స్ ఇచ్చినా బలంగా పోరాడగలరా అనే అనుమానాలు ఉన్నాయట. చోడవరం మాజీ ఎమ్మెల్యే రాజు, మాడుగుల నుంచి గవిరెడ్డి రామానాయుడు, అరకు నుంచి మాజీ మంత్రి శ్రవణ్ కుమార్, యలమంచిలి, విశాఖ నార్త్, అనకాపల్లి నియోజకవర్గాల్లో పోటీకోసం సీనియర్లు ప్రయత్నాలు ప్రారంభించారట.జనసేనతో పొత్తులు ఆధారంగా ఇప్పుడు పార్టీలో ఉన్న ముఖ్య నేతలు కొందరు తమ రాజకీయ భవిష్యత్‌పై కీలక నిర్ణయం తీసుకునే అవకాశాలు లేకపోలేదు. రెండు పార్టీల ఓటు బ్యాంక్ ఆధారంగా పోటీకి సిద్ధం అయ్యేందుకు ప్రయత్నాల్లో స్పీడ్ పెంచారట. టీడీపీ హైకమాండ్ మాత్రం మాజీ ఎమ్మెల్యేలకు అవకాశం కల్పించేందుకు ఒకటి రెండుసార్లు సర్వేలు చేయించాకే నిర్ణయం తీసుకోవాలని భావిస్తోందట. అందుకే ఆశావహుల్లో ఎంత మందికి అవకాశం దక్కుతుందో అనే చర్చ నడుస్తోంది.

# ఏజెన్సీపై డెంగీ పడగ.. ఆస్పత్రుల్లో బెడ్ లు నిల్

రాజమండ్రి సెప్టెంబర్ 7, భారీవర్షాలతో ఈ ఏడాది వర్షాకాలం అంతా ముగిసిపోయింది. ఇప్పుడు వరద నీరు బయటకు వెళ్లిపోయింది. బురద మాత్రం మిగిలింది. బురదతో పాటు దోమలు కూడా బాగా వ్యాపించాయి. విష జ్వరాలు అల్లూరి సీతారామరాజు జిల్లా విలీన మండలాల్లోని ఏజెన్సీ ప్రాంతంలో వణుకు పట్టిస్తున్నాయి, గోదావరి వరదల కారణంగా గ్రామాలన్నీ నీట మునగడంతో ఏ గ్రామంలో చూసినా జ్వరాలతో ప్రజలు మంచాన పడుతున్నారు, ఆసుపత్రులలో బెడ్లు ఖాళీ లేక బెడ్ కోసం చేతిలో సిలైన్ బాటిల్ పట్టుకొని రోగులు అటు తిరుగుతున్నారు, జ్వరాల బారిన పడిన వారితో హాస్పిటల్ కిక్కిరిసిపోయిన పరిస్థితి ఏజెన్సీ లో కనిపిస్తున్న వైనంపై ఒక రిపోర్ట్.అల్లూరి సీతారామరాజు జిల్లా విలీన మండలాల్లో విషజ్వరాల పరిస్థితి దారుణంగా ఉంది. డెంగీ జ్వరాలు డేంజర్ బెల్స్ మోగిస్తుంది, వరదలు తగ్గుముఖం పట్టిన తరువాత ఇళ్లకు చేరుకున్న వరద బాధితుల తిరిగి ఆసుపత్రి పాలవుతున్నారు, వరదలు తగ్గుముఖం పట్టి 15 రోజుకు గడుస్తున్నా కనీసం గ్రామాల్లో హెల్త్ క్యాంపులు కూడా పెట్టలేదని గిరిజనులు వాపోతున్నారు, చింతూరు ఏరియా ఆసుపత్రి రోగులతో కిక్కిరిసిపోయింది, రోజు 100 కు పైగా జ్వర పీడితులు ఆసుపత్రికి వస్తే అందులో 10 నుండి 20 మంది డెంగీ బాధితులు ఉంటున్నారు. ఆసుపత్రిలో డెంగీ టెస్ట్ కిట్లు లేకపోవడంతో 700 నుండి 1000 రూపాయలు చెల్లించి బయట టెస్టులు చేయించుకోవలసి వస్తుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.విలీన మండలాల్లో ఏరియా ఆసుపత్రి పేరుకు మాత్రమే ఉందని అందులో కనీసం ఒక్కరంటే ఒక్కరూ కూడా పూర్తి స్థాయి వైద్యుడు లేరని స్థానిక గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, విలీన మండలాల్లో ఏ ఒక్క ప్రభుత్వ ఆసుపత్రిలో కూడా వైద్యులు లేకపోవడంతో స్థానికంగా ఉన్నా ఆర్ఎంపీ వైద్యులను గిరిజనులు ఆశ్రయిస్తున్నారు, గిరిజన అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఐటీడీఏ కనీసం స్థానిక గిరిజనులు ఎలా ఉన్నారో కూడా పట్టించుకోవడం లేదని అసలు ఈ రాష్ట్రంలో గిరిజన సంక్షేమశాఖ, ఉందా లేదా అంటూ స్థానిక గిరిజనులు ప్రశ్నిస్తున్నారు.వరదలు తగ్గుముఖం పట్టిన తరువాత గ్రామాల్లో బురద నిండిపోయి ప్రజలు డెంగ్యూ భారిన పడి ప్రాణాలు కోల్పోతుంటే కనీసం ఐటీడీఏ అధికారుల్లో చలనం లేదంటూ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ఆసుపత్రిలో వైద్యం చెయ్యడానికి డెంగ్యూ కిట్లు లేవని, మందుల కొరత కూడా తీవ్రంగా ఉందని 2000 ఇంజక్షన్లు కావాలని అడిగితే 20 మాత్రమే వస్తున్నాయని వైద్యులు వాపోతున్నారు ఈ చాలీచాలని మందులతో ఎలా వైద్యం చెయ్యాలని అంటున్నారు.

## మరో దండి యాత్ర, మరో క్విట్ ఇండియా ఉద్యమం కాబోతున్న భారత్ జోడో యాత్ర

కడపదండి యాత్ర, క్విట్ ఇండియా ఉద్యమం నాటి బ్రిటిష్ దుష్ట పాలనకు చరమగీతం పాడాయి. నేటి భారత్ జోడో యాత్ర తో బిజెపి దుష్ట పాలన నుండి దేశానికి, వైకాపా దుష్ట పాలన నుండి రాష్ట్రానికి విముక్తి కలిగి అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తథ్యమని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తులసీ రెడ్డి అన్నారు.భారత్ జోడో యాత్ర సెప్టెంబర్ 7 నుంచి 148 రోజుల పాటు 12 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాలు, 68 లోక్ సభ స్థానాలు, 203 అసెంబ్లీ స్థానాల మీదుగా 3571 కిలోమీటర్లు దూరం కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు సాగుతుంది.ఆంధ్రప్రదేశలో 4 రోజుల పాటు రాయదుర్గం, ఆలూరు, ఆదోని, మంత్రాలయం అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 100 కిలోమీటర్లు సాగుతుందని అన్నారు.త్వరలో శారీరక దారుఢ్యం కలిగి రోజుకు 25 కిలోమీటర్లు నడవగలిగే అంకిత భావం ఉన్న 100 నుంచి 150 మందిని ప్రదేశ్ యాత్రికులుగా ఎంపిక చేయడం జరుగుతుంది. పాద యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ నిర్ణీత సమయాలలో, ప్రదేశాల్లో అటు ప్రజలను, ఇటు కాంగ్రెస్ శ్రేణులను కలుసుకుంటారు. ఈ పాదయాత్రలో అందరూ పాల్గొని ఫలప్రదం, శుభప్రదం, జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేసారు.

# లక్ష్మీ నరసింహస్వామి ఆలయం పునఃప్రారంభం

తిరుపతి 36 ఏళ్ళ క్రితం మూసి వేసిన శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవాలయంను తిరిగి పునః ప్రతిష్ఠించేందుకు టిటిడి పాలక మండలి ముందుకు రావడం సంతోషకరమని టిటిడి పాలక మండలి సభ్యులు పోకల అశోక్ కుమార్ తెలిపారు.. ఇవాళ తిరుపతి కపిలతీర్థంలో మూసి వేసిన లక్ష్మి నరసింహ దేవాలయంను ఆయన సందర్శించి దేవాలయం పనులను ఆయన పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. డిసెంబరు నెలలో భక్తులకు అందుబాటులో శ్రీ లక్ష్మి నరసింహా స్వామి దేవాలయంను అందుబాటులో తీసుకొచ్చేందుకు టిటిడి అధికారులు కృషి చేస్తున్నారని, అయితే 36 ఏళ్ళ క్రితం మూసి వేసిన ఆలయం గురించి ఓ భక్తుడు తన దృష్టికి తీసుకుని రావడం జరిగిందన్నారు ... ఈ విషయాన్ని పాలక మండలిలో చర్చించి దేవాలయం పునఃప్రతిష్ఠాకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.. టిటిడి దేవాలయాల్లో లక్ష్మి నరసింహ స్వామి దేవాలయాలు అభివృద్ధి చేందక పోవడం విచారకరమన్నారు.. తిరుపతిలోని కపిలతీర్థం ఆలయంలో వివిధ ఆలయాల సందర్శనంకు భక్తులు ఎక్కువగా వస్తుంటారని, అలాగే ఇక్కడే వెలసిన అతి పురాతన అలయం శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయంను అభివృద్ధి చేసేందుకు టిటిడి పాలక మండలి కృషి చేస్తుందన్నారు..

# మన ఊరు మన బడి పనుల పై ఇంజనీరింగ్ అధికారులు, విద్యాశాఖ అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్

మన ఊరు మన బడి క్రింద పాఠశాలల్లో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణ జిల్లాలో మన ఊరు మన బడి లో మొదటి దశలో ఎంపిక చేసిన పాఠశాలలో చేపట్టిన పనుల పురోగతి పై సంబంధిత అధికారులతో సమీక్షించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా మన ఊరు మన బడిలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నిధులు వెచ్చించి వసతులు కల్పించడంతో పాటు, ఆంగ్ల మాధ్యమంలో బోధన ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా మొదటి దశలో ఎంపిక చేసిన పాఠశాలల్లో పనులు పురోగతి ఆశించిన స్థాయిలో లేనందున, పనులు పూర్తి కానందున అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయులు, ఎస్.ఎం.సి. చైర్మన్ లతో మాట్లాడి పనులు ఆగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకొని, పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.మొదటి దశలో ఎంపిక చేసిన పాఠశాలలో జరుగుతున్న పనులకు సంబంధించిన ఫోటోలను ఎప్పటికప్పుడు తనకు పంపాలని తెలిపారు. ఈ సందర్భంగా కాంపౌండ్ వాల్, సంప్, కిచెన్ షెడ్, టాయ్లెట్, మరమ్మతులు, అదనపు తరగతి గదుల నిర్మాణం, విద్యుత్, తదితర పనులకు సంబంధించిన పనుల పురోగతి వివరాలను మండలాల, పాఠశాలల వారిగా జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఓదెల మండలానికి సంబంధించి పాఠశాలల అభివృద్ధి పనులు గత నెల రోజులుగా ఏ మాత్రం పురోగతి సాధించకపోవడం పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్, పనుల్లో జాప్యం చేస్తున్న ఇంజనీరింగ్ అధికారి పై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మన ఊరు మన బడి కింద మండలాలకు కేటాయించిన ఇంజనీరింగ్ అధికారులు ప్రతి వారంలో ఒక్క పాఠశాల పనులను క్షేత్రస్థాయిలో కనీసం 2 సార్లు తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయాలని, ఇంజనీరింగ్ అధికారులు ప్రతి రోజూ పనుల పురోగతి అప్ డేట్ చేయాలని ఆదేశించారు. జిల్లాలో మన ఊరు మన బడి కార్యక్రమ అమలు కోసం ఎంపిక చేసిన ప్రతి పాఠశాల కు 10% నిధులు ముందస్తుగా అందించామని కలెక్టర్ సూచించారు.

మన ఊరు మన బడి కింద చేపట్టిన పనుల వివరాలు పరిశీలించి బిల్లులు తయారు చేయాలని, నిధులకు ఆటంకం లేనందున పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మన ఊరు మన బడి కింద గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టే ఉపాధి హామీ పనులకు సంబంధించి తప్పనిసరిగ్గా గ్రామ సర్పంచ్ కు సమాచారం అందించి, గ్రామ సభ తీర్మానం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. మన ఊరు మన బడి సంబంధించి ఇంజనీరింగ్ అధికారులు అందించిన డెడ్ లైన్ నోట్ చేసుకున్నామని, సకాలంలో పనులు పూర్తి కాకపోయినా, అలసత్వం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. అంతకు ముందు వివిధ పాఠశాలల్లో చేపట్టిన పనులకు సంబంధించిన పురోగతినీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పాఠశాలల వారీగా ఫోటోలను పరిశీలించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖాధికారి మాధవి, ఈ.ఈ. పంచాయతీ రాజ్ మునిరాజ్, ఈ.ఈ. ఆర్ అండ్ బి నరసింహా చారి, ఎం. ఈ. ఓ లు, ఇంజనీర్లు, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 40 కేజీల జ్యువెలరీ.. 20 బీరువాల బట్టలు..

హైదరాబాద్, సెప్టెంబర్ 7, జిమ్నాస్టిక్స్‌లో నేషనల్ ఛాంపియన్స్.. 26 ఛాంపియన్ మెడల్స్ సాధించింది. స్టేట్ లెవల్‌లో స్విమ్మర్.. జిమ్ ట్రైనర్.. యోగా ట్రైనర్.. మోడల్.. గూగుల్‌లో పనిచేసిన ఇంజనీర్.. డాన్సర్.. యాంకర్.. ఇలా బిగ్ బాస్ సీజన్ 6 కంటెస్టెంట్స్ నేహా చౌదరిలో చాలా కళలు ఉన్నాయి. తనని తాను బిగ్ బాస్ స్క్రీన్‌పై చూసుకోవాలనే ఆశతో ఇండస్ట్రీలో అడుగుపెట్టిన నేహా చౌదరి చివరికి బిగ్ బాస్ హౌస్‌లో కనిపించింది.మహాన్యూస్‌లో యాంకర్‌గా కెరియర్ స్టార్ట్ చేసిన నేహా చౌదరి.. ముఖ్యంగా ఆమె తెలుగులో ఉన్న ఏకైక స్పోర్ట్ యాంకర్. నేహా చౌదరి తల్లి కబాడీ, కోకో ప్లేయర్ కావడంతో చిన్నప్పటి నుంచి స్పోర్ట్స్ వైపు ఇంట్రస్ట్ చూపించింది నేహా చౌదరి.ఈ ప్రపంచంలో తనకి ఇష్టమైన వాళ్లు అంటే.. అమ్మ నాన్నే అని చెప్పిన నేహా చౌదరి వాళ్ల టాటూలను చేతిపై వేయించుకుంది. వాళ్ల తరువాత ఇల్లే తన ప్రపంచం అని చెప్తూ.. తన కాలిపై వేయించుకున్న ఇంటి టాటూని చూపించింది నేహా చౌదరి.తాను సంపాదించింది తనకే సరిపోతుందని.. ఒక్కోసారి తన ఈఎంఐలు కూడా తన తల్లే కడుతుందని చెప్తోంది. మరి సంపాదించింది అంతా ఏం చేస్తున్నావ్ అని అంటే.. నా

**200 జతల చెప్పులు.. ఇదే నా ఆస్తి: నేహా చౌదరి**


సంపాదన అంతా మోడలింగ్‌కి సంబంధించే ఉంటుందని అంటుంది. మరింత అందంగా కనిపించాలని రకరకాల వస్తువుల్ని కొంటూ ఉంటానని.. వాటి కోసం సంపాదన

అంతా ఖర్చు చేస్తానని అంటోంది. ఇప్పటివరకూ తన దగ్గర.. 40 కేజీల జ్యువెలరీ.. 20 బీరువాల బట్టలు.. 200 జతల చెప్పులు ఉన్నాయని.. ఇదే నా ఆస్తి అని చెప్తుంది నేహా.ఇక పెళ్లి గురించి చెప్తూ.. తన పెళ్లిపై తనకి చాలా హోప్స్ ఉన్నాయని అయితే నిర్ణయం మాత్రం పేరెంట్స్‌దే అని చెప్తోంది నేహా. అందుకే తన బయోడెటా.. అన్ని మాట్రిమోనీ సైట్‌లలో ఉంటుందని చెప్పింది. మరి ఇప్పటివరకూ తనకి ప్రపోజ్‌లు రాలేదని.. ఈ విషయంపై తన తల్లితో కూడా చర్చించేదాన్ని అని చెప్పింది. అందరికీ ప్రపోజ్‌లు వస్తున్నాయి కానీ.. నాకు మాత్రం రావడం లేదని ఫీల్ అయిపోయేదాన్నిని చెప్పింది నేహా. మరి బిగ్ బాస్ హౌస్‌లోకి వెళ్లింది కాబట్టి.. అక్కడేమైనా ప్రపోజ్‌లు వస్తాయేమో.. నేహా ఆశ తీరుతుందేమో చూద్దాం.

# అగ్రిగోల్డ్ బాధితుల ఆందోళన

విజయవాడ సెప్టెంబర్ 7, అగ్రిగోల్డ్ బాధితులు మరోసారి రోడ్డెక్కారు. తమకిచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలంటూ విజయవాడలో ధర్నా చేపట్టారు.అగ్రిగోల్డ్ కస్టమర్లు, ఏజెంట్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆక్రందన సభ చేపట్టారు.. పెద్ద సంఖ్యలో అగ్రిగోల్డ్ బాధితులు ధర్నా చౌక్‌కు రావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. గుడారాలు, టెంట్లు వేసి పెద్ద సంఖ్యలో బాధితులు ధర్నా పాల్గొన్నారు. వివిధ జిల్లాల నుంచి విజయవాడకు తరలివచ్చిన బాధితులు ధర్నా చౌక్‌లో బైఠాయించారు. డిసెంబర్ వరకు ఒక లెక్క అది దాటితే ఇంకో లెక్క అంటూ ప్రభుత్వానికి అల్టిమేట్ జారీ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు పరచడంలో ఎందుకు తాత్సారం జరుగుతుందో జవాబు చెప్పాలని నిలదీశారు.బాధితులు చనిపోతున్నా ప్రభుత్వంలో చలనం రావడం లేదని అగ్రిగోల్డ్ బాధితులు ఆరోపించారు.ఇచ్చిన హామీ ప్రకారం చనిపోయిన అగ్రిగోల్డ్ బాధితులకు 10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు విభజన హామీల సాధన సమితి కన్వీనర్ చలసాని.. అగ్రిగోల్డ్ బాధితుల తరపున పోరాడుతున్న సీపీఐ నేత ముప్పాళ్ల నాగేశ్వరావు బాధితులకు ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ వరకు డెడ్‌లైన్ పెడుతున్నామని, లేదంటే సీపీఐ తరపున పోరాటం చేస్తామంటూ ఆయన హెచ్చరించారు.అగ్రిగోల్డ్ సంస్థ మోసానికి గురైన బాధితులంతా న్యాయం కోసం ఆందోళనకు దిగారు. అగ్రిగోల్డ్‌లో తమ డిపాజిట్లు పెట్టి మోసపోయామని..ఈ కారణంగా తమ అమ్మాయిల వివాహాలు జరిపించలేని దుస్థితిలో ఉన్నామని, ఇకనైనా ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని తమను ఆర్థికంగా ఆదుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మళ్లీ ఫీవర్ సర్వే



వరంగల్, సెప్టెంబర్ 7, (న్యూస్ పల్స్)రాష్ట్రంలో మళ్లీ జ్వర సర్వే షురూ కానున్నది. గ్రేటర్? హైదరాబాద్?తో పాటు మున్సిపాలిటీల్లో ప్రారంభించనున్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్? వంటి జ్వరాలు పెరగడంతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. ఈ సర్వేలో భాగంగా ఇంటింటికి తిరిగి ఆశాలు, ఏఎన్?ఎంలు మందులు కిట్లను పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే టీఎస్?ఎంఎస్?ఐడీసీ మందుల కిట్లను రెడీ చేస్తున్నది. కరోనా సమయంలో చేసిన ఫీవర్? సర్వే తరహాలోనే ఇప్పుడు చేయనున్నారు. జ్వర లక్షణాలున్నోళ్లందరికీ ఈ మందులు వాడాలని పంపిణీ చేయనున్నారు. ఈ కిట్? తర్వాత తగ్గకపోతే టెస్టులకు వెళ్లనున్నారు. అంతేగాక ప్రతీ రోజు మానిటరింగ్? చేసేందుకు ఆశాలు, ఏఎన్?ఎంలు వివరాలు నమోదు చేసుకోనున్నారు. ఇప్పటికే ఆశాలు, ఏఎన్?ఎంలకు ఫీవర్? సర్వేపై అవగాహన కల్పించారుజ్వర సర్వేలో వ్యాధి లక్షణాలున్నోళ్లందరి రక్త నమూనాలు సేకరించనున్నారు. ఆ తర్వాత వాటిని తెలంగాణ డయాగ్నస్టిక్స్? కు పంపించి, ఫలితాలను నిర్ధారిస్తారు. దాని బట్టి పేషెంట్? ఆరోగ్య పరిస్థితిని అంచనా వేస్తారు. అవసరం ఉన్నోళ్లను వెంటనే ఆసుపత్రులకు తరలిస్తారు. దీని వలన వేగంగా వైద్యం అందడమే కాకుండా వ్యాధి వ్యాప్తి కూడా తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. మరోవైపు ఈ జ్వర సర్వేలోనే బూస్టర్? డోసులు కూడా పంపిణీ చేయనున్నారు. పది గంటలకు పది నిముషాలు ఇంటిని శుభ్రపరిచే కార్యక్రమం కోసం చిన్న పిల్లలను, మహిళలు, మెప్మాను కూడా సమన్వయం చేయనున్నారు. అంతేగాక విద్యార్థులు, ప్రిన్స్ పాల్స్, టీచర్లు అందరూ పాల్గొని సామాజిక బాధ్యతగా పని చేసేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. ఈ కార్యక్రమం పూర్తైన తర్వాత జీహెచ్?ఎంసీ ఆధ్వర్యంలో ఇళ్లకు స్టిక్కర్స్ అంటించనున్నారు. ఈకార్యక్రమంలో స్కూల్ ఎడ్యుకేషన్, మున్సిపల్ డిపార్ట్మెంట్, మెప్మా, విద్యార్థులు, పిల్లలను , ప్రజా ప్రతినిధులను , స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు ఇందులో భాగస్వామ్యం కానున్నారు.

# నేడు అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం




యునెస్కో సెప్టెంబర్ 8వ తేదీని అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం గా ప్రకటించింది. 1965వ సంవత్సరం, నవంబర్ 17వ తేదీన యునెస్కో సభ్యదేశాల విద్యాశాఖా మంత్రుల మహాసభ అనంతరం అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని ప్రకటించారు. ఆ తరువాత 1966వ సంవత్సరం నుండి ప్రతి ఏడాదీ క్రమం తప్పకుండా జరుపుకుంటున్నాం. అక్షరాస్యతను వ్యక్తులు మరియు సంఘాలకు అందించటం. ఇది పిల్లల్లో విద్యపైనేగాకుండా, వయోజన విద్యమీద కేంద్రీకరించడమే అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం ముఖ్యోద్దేశం.చరిత్ర:1965లో యునెస్కో ప్రతిపాదనతో సెప్టెంబర్ 8, 1966న మొట్టమొదటి సారిగా ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం జరుపుకున్నారు. 2003-12 దశకంను యునైటెడ్ నేషన్స్ అక్షరాస్యత దశకంగా యునెస్కో ప్రకటించింది. ఆ దశకం అంతా లిటరసీ ఇనిషియేటివ్ ఫర్ ఏమ్పోవేర్మెంట్ ప్రక్రియ ద్వారా అక్షరాస్యుల సంఖ్యను పెంచటానికి కృషి చేసింది. ఢాకాలో జరిగిన కార్యక్రమంలో బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, యునెస్కో డైరెక్టర్ జెనరల్ ఇరిన బొకోవా కలసి 2014 యునెస్కో అంతర్జాతీయ అక్షరాస్యత బహుమతిని అందించారు. కన్ఫ్యూషియస్ కింగ్ సేజోంగ్ బహుమతులు పొందారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినం వేడుకలు వివిధ దేశాలలో ప్రత్యేక నేపథ్యాలుగా అందరికీ విద్య అనే నినాదంగా లక్ష్యాలను చేరే కృషి చేస్తున్నాయి. ఇతర యునైటెడ్ నేషన్స్ కార్యక్రమాలు యునైటెడ్ నేషన్స్ అక్షరాస్యత డికేడ్ నిర్వహిస్తున్నవి. 2007 మరియు 2008 వేడుకలలో ఆరోగ్య విద్యలో భాగంగా "అక్షరాస్యత మరియు ఆరోగ్యం" పై అభివృద్ధిలో ముందంజలోని సంస్థలకు బహుమతులు ఇవ్వడం జరిగింది . తల్లిదండ్రులు విధిగా తమ పిల్లలను బడిలో చేర్పించాలి, బాలకార్మికులుగా మారకుండా చూడాలి. బాలల ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం మాదిరిగా ప్రతి ఒక్కరు వయోజనులతో కలిసి చదువుకోవాలన్న చట్టం తేవాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అక్షరాస్యత సాధనలో చిత్తశుద్ధిగా వ్యవహరించాలి. నిరక్షరాస్యత నిర్మూలన కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేసి ఫలితాలు రాబట్టాలి. కేరళ, పశ్చిమ బెంగాల్‌రాష్ట్రాలను ఆదర్శంగా తీసుకోవాలి. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి. మహిళల అక్షరాస్యత పెంపునకు ప్రత్యేక కార్యక్రమాలు తీసుకోవాలి. వారికోసం ప్రత్యేక బడులు, కళాశాలలు ఏర్పాటు చేయాలి. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యానుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలి. నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని ఖచ్చితంగా అమలుచేయాలి. 5-14 ఏళ్ల బాలబాలికలంతా బడిలో ఉండేలా చూడాలి. బాల్యవివాహాలు చేసిన వారిపై చట్టాలను కఠినంగా అమలు చేయాలి.

# పోలీస్ స్టేషన్ లో యువకుడు మృతి

శ్రీకాకుళం శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం పోలీసు స్టేషన్ లో లాకప్ డెత్ జిల్లాలో కలకలం రేపింది. యల్ యన్ పేట మండలం కొమ్మువలస గ్రామానికి చెందిన కూర్మాపు మహేష్ బూర్జ పోలీసు స్టేషన్ లో అనుమాస్పద స్థితిలో మృతి చెందాడు. బూర్జ మండలం సుంకరిపేట గ్రామంకు చెందిన మూడు విఆర్ఏ కొనాడ శ్రీదేవి తన నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో గత మూడు రోజులుగా శ్రీదేవి భర్త మహేష్ ను పోలీసులు దర్యాప్తు నిమిత్తం బూర్జ స్టేషన్ కు తీసుకు వచ్చారు. విచారణ చేస్తున్న సమయంలో మహేష్ మృతి చెందడంతో మృతుని బంధువులు బూర్జ పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. మృతిని మహేష్ ఎందుకు చనిపోవలసి వచ్చిందని, తమకు న్యాయం చేయాలని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి బూర్జ స్టేషన్ కు శ్రీకాకుళం జిల్లా ఎస్పీ రాధిక చేరుకుని మృతికు గల కారణాలపై ఆరా తీసారు.మృతదేహంను పోస్ట్ మార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆసుపత్రికు తరలించారు. ఈ విషయం పై పోలీసులు మీడియాకు ఎటువంటి సమాచారం ఇవ్వడంలేదు.

# రెండు స్కూలు బస్సుల ఢీ..విద్యార్థులకు స్వల్ప గాయాలు

ఏలూరుఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం రౌతుగూడెం వద్ద ముందు వెళ్తున్న స్కూల్ బస్ ను మరో స్కూల్ బస్సు వెనుకనుంచి ఢీకొట్టింది. ఘటనలో విద్యార్దులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్వల్ప గాయాలైన విద్యార్థులను 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. ప్రమాద వార్త తెలియగానే పిల్లలను తల్లిదండ్రులు వారి ఇళ్లకు తీసుకువెళ్లిపోయారు. నిర్లక్ష్యంగా డ్రైవ్ చేసి ప్రమాదానికి కారణమయ్యారు అని ఆరోపిస్తూ బస్ డ్రైవర్ పై ఆగ్రహంతో వాగ్వివాదానికి దిగారు. బుట్టాయగూడెం మండలం పందిరిమామిడి గూడెం కు చెందిన సెంట్ జోసెఫ్ స్కూల్ బస్ ను జంగారెడ్డిగూడెం కు చెందిన వెంకటేశ్వర కాలేజీ కి చెందిన స్కూల్ బస్ వెనుకనుండి ఢీ కొట్టింది. ఘటనలో ప్రమాదంలో బస్ అద్దాలు ధ్వంసం అయ్యాయి.

# రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పల్నాడు కొమెరపూడి -తకెళ్ల పాడు మార్గం మధ్యలో రోడ్డు ప్రమాదం జరిగింది. వ్యవసాయ కూలీ లతో వెళుతున్న ఆటో ని మరో ఆటో ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మృతుడు మహంకాళి(50)వ్యవసాయ కూలి. ఘటనలో పలువురి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆటోలో 12 మంది వ్యవసాయ కూలీలు ఉన్నట్లు సమాచారం. కూలీలు అందరు ముపాళ్ళ మండలం మాదల గ్రామస్తులు. మాదల నుంచి తకెళ్ల పాడు మిర్చినారు పనులకు వెళ్లివస్తుండగాప్రమాదమని అన్నారు.

# గుత్తి ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ వర్కర్లు,సహాయకుల ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం.

గుత్తి  గుంతకల్,పామిడి,పెద్దవడుగూరు మండలాలకు సంబంధించి అంగన్వాడీ వర్కర్లు,  సహాయకుల ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేయుటకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవని సిడిపిఓ నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దరఖాస్తు చేసే అభ్యర్థులు జులై ఒకటి 2022 నాటికి 21 సంవత్సరాల నుండి 35 సంవత్సరాల లోబడి ఉండవలెనని,పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండవలెనని మరియు వివాహితులయి స్థానికంగా నివాసం ఉండవలెనని,కావున అభ్యర్థులు తమ దరఖాస్తులను సెప్టెంబర్ ఏడవ తేదీ నుండి సెప్టెంబర్ 13వ తేదీ వరకు సిడిపిఓ కార్యాలయం గుత్తి నందు సమర్పించాలని,మరిన్ని పూర్తి వివరాలకు సిడిపిఓ కార్యాలయం గుత్తి నోటీసు బోర్డు నందు చూసుకొనవలెను అని తెలిపారు.

# వినాయక నిమజ్జనం ను ప్రశాంతవాతావరణంలో జరుపుకోండి ....

కర్నూలు   :   కర్నూలు నగరంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ మళ్ళింపు .?   వినాయక్ ఘాట్ ఏరియా దగ్గర ఏటువంటి వాహానాలకు పార్కింగ్ ( నో పార్కింగ్ జోన్) కు అనుమతి లేదు.?   1) కలెక్టర్ ఆఫీసు నుండి  విశ్వేశరయ్య సర్కిల్ ( జ జంక్షన్)  వరకు, 2) గ్రాయత్రి ఏస్టేట్, 3) సెంట్రల్ ప్లాజా, 4) సత్యనారాయణ స్వామి గుడి, 5) అయ్యప్ప స్వామి గుడి దగ్గర ఏ వాహనం  పార్కింగ్ కు అనుమతి లేదు. ?

వినాయక నిమజ్జనానికి  2 వేల  మంది పోలీసులతో కట్టుదిట్టమైన  భద్రతా ఏర్పాట్లు.?   నిమజ్జనం రోజు అర్థరాత్రి దాటిన తర్వాత డిజేలకు అనుమతి లేదు.?  నిమజ్జనం కార్యక్రమం అంతా డ్రోన్, బాడి ఓన్ కెమెరాలు, సిసికెమెరాలు, విడియో కెమెరాలతో చిత్రికీరణ.? గ ణే ష్ నిమజ్జనం (2022 సెప్టెంబర్ 8న గురువారం) జరగనున్న సంధర్బంగా పోలీసుశాఖ కట్టుదిట్టమైన భారీ బందోబస్తుతో భద్రతా చర్యలు చేపట్టిందని, ప్రశాంత వాతవరణంలో శాంతియుతంగా నిర్వహించుకునేందుకు అవసరమైన

*కర్నూలు జిల్లా ఎస్పీ  శ్రీ సిద్దార్థ్ కౌశల్ ఐపియస్ .*

అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు కర్నూలు జిల్లా ఎస్పీ  శ్రీ సిద్దార్థ్ కౌశల్ ఐపియస్  బుధవారం  తెలిపారు.? కర్నూలు నగరంలో ప్రజలకు, వాహనదారులకు, విగ్రహా ఊరేగింపులో పాల్గొనే భక్తులకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు ట్రాఫిక్ నిబంధనలు చేసి ట్రాఫిక్ మళ్ళింపు చేయడం జరిగిందని ఈ క్రింది సూచనలు, సలహాలు పాటించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ?   వాహనచోదకులు, ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సహాకరించాలన్నారు. ?   నిమజ్జనం  రోజు నగరంలో ఉదయం 10 గంటల నుంచి గణేష్ నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు ట్రాఫిక్ ను మళ్లించామన్నారు .? అత్యవసర సేవలైన వాహనాలు అనగా  108,  ఫైర్ , అంబులెన్సులు మరియు పోలీసు వాహనాలు మాత్రమే నిమజ్జన మార్గంలో అనుమతి కలదు, ఇతర వాహనాలకు అనుమతి లేదు. ?  కర్నూలు ఆర్టీసి బస్టాండ్ మీదుగా రాజ్ విహార్ సెంటర్, ప్రభుత్వ ఆసుపత్రి, వినాయక్ ఘాట్, మద్దూర్ నగర్, రోడ్డు భవనాల శాఖ మీదుగా వాహానాల రాకపోకలను నిషేదించామన్నారు. ?  ఆ  వాహానాలను బళ్ళారి చౌరస్తా నుండి జాతీయ రహాదారి(బైపాన్) మీదుగా మళ్ళిస్తామన్నారు.? ఆత్మకూరు, నంద్యాల, నందికోట్కూరు, నంద్యాల చెక్ పోస్టు వైపు నుండి నగరంలోనికి వచ్చే వాహానాలు  రింగ్ రోడ్డు మీదుగా పుల్లారెడ్డి కాలేజ్ , బి. తాండ్రపాడు  , టివి 9 కాలనీ మీదుగా బైపాస్ రోడ్డు కు చేరుకుంటాయన్నారు. ?  హైదరాబాద్, గద్వాల, అలంపూర్ నుండి వచ్చే వాహనాలు మామిదాలపాడు తుంగభద్ర బ్రిడ్జి  జంక్షన్ క్రాస్ నుండి కర్నూలు నగరంలోనికి రాకుండా వయా జాతీయరహాదారి మీదుగా ఆర్టీసి బస్టాండుకు చేరుకుంటాయన్నారు.?   అనంతపురం నుండి వచ్చే వాహానాలు గుత్తి పెట్రోల్ బంకు నుండి బైపాస్ మీదుగా ఆర్టీసి బస్టాండ్ చేరుకుంటాయన్నారు.?   నిమజ్జనం పూర్తయిన తర్వాత వాహనాలు దేవనగర్ మీదుగా  కృష్ణ నగర్ ఉ కల్లూరు బ్రిడ్జి మీదుగా బయటకు వెళతాయన్నారు. రేపు గణేష్ నిమజ్జనం  సంధర్బంగా ఆహ్లాదకరమైన , సంతోషకరమైన వాతావరణంలో ఏవరికి అసౌకర్యం కలగకుండా నిమజ్జనం సంతోషంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ  సిద్దార్థ్ కౌశల్ ఐపియస్ ప్రజలకు, విగ్రహా నిర్వహకులకు ఈ క్రింది సూచనలు, సలహాలు తెలియజేశారు. విగ్రహాల నిర్వహకులు సమయభావం పాటిస్తూ సరైన సమయానికి విగ్రహాల ఊరేగింపుకు  అవసరమైన వాహానాలను, క్రేన్ల ను సిధ్ధంగా ఉంచుకోవాలన్నారు. మద్యం సేవించరాదు, మద్యం అమ్మకాలు పూర్తిగా నిషేధం, మద్యం సేవించి నిమజ్జనంలో ఎవరూ పాల్గొనరాదన్నారు. విగ్రహాల ఊరేగింపులో వినియోగించే వాహానాలు సరైన కండిషన్ సామర్థ్యం కలిగి ఉన్నాయో  చూసుకోవడమే కాకుండా దానికి ఉపయోగించే విద్యుత్ కనెక్షన్



లు, డెకరేషన్ లను తగు జాగ్రత్తగా నిపుణులైన వారిచే ఏర్పాటు చేసుకోవాలన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. విగ్రహాల ఊరేగింపు వాహనాల పై ప్రజలు, చిన్నపిల్లలు ఎక్కువగా ఎక్కకుండా వాహన చక్రాల క్రింద పడి ప్రమాదాల బారిన పడకుండా చూసుకోవాలన్నారు.పలు చోట్ల విగ్రహాల నిమజ్జన సమయంలో పిల్లలు, వృద్దులు , మద్యం సేవించిన వారు కెసి కెనాల్  నీటి ప్రవాహాం దగ్గరకు వెళ్ళకుండా  విగ్రహా నిర్వాహకులే నియంత్రించాలన్నారు. విగ్రహాల ఊరేగింపులో వాహానాలకు, విగ్రహాలకు పైన కరెంటు తీగలు, కేబుల్ తీగలు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విగ్రహాల ఊరేగింపులో పాల్గొనే వాహానాలకు సంబంధించిన డ్రైవర్లు అన్ని జాగ్రత్తలు తీసుకోని నియమ నిబంధనలు పాటించే విధంగా  విగ్రహా నిర్వాహకులు నియంత్రించాలన్నారు. ? ఆకతాయిలు మద్యం సేవించి అత్యుత్సాహం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు, మతపెద్దలు, రాజకీయ పార్టీలు, యువత , మిడియా నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేందుకు సహాయ సహాకారాలు అందించాలన్నారు. ?  నిమజ్జన ఊరేగింపు సమయములో ఇతరుల మనోభావాలను కించపరిచే విధంగా ఎవరూ వ్యవహరించరాదన్నారు. భారీ సంఖ్యలో పోలీసు బలగాలను మోహరింపజేశామన్నారు. ? నిబంధనలకు  ఎవరు  విరుద్ధంగా ప్రవర్తించినా, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమానిత వస్తువులు గాని, వ్యక్తులు గాని తారసపడితే డయల్ 100 గాని, స్థానిక పోలీసులకు గాని ప్రజలు సమాచారం అందించాలన్నారు. ?   బాంబు డిస్పోజబుల్, డాగ్ స్క్వాడ్ బృందాలతో విస్తృత తనిఖీలు చేస్తున్నామన్నారు.  అసాంఘిక శక్తులు, అల్లరి మూకల పై  గట్టి నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.గణేష్ నిమజ్జన వేడుకల్లో ఏ చిన్న పాటి సంఘటన చోటు చేసుకున్నా బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సంధర్బంగా జిల్లా ఎస్పీ   హెచ్చరించారు.

## కర్నూలు వినాయక నిమజ్జన ఘాట్ ను పరిశీలించిన.... జిల్లా ఎస్పీ శ్రీ సిద్దార్థ్ కౌశల్  ఐపియస్ భద్ర్రత ఏర్పాట్ల గురించి ఆరా తీసిన ... జిల్లా ఎస్పీ.



కర్నూలు , :బుధవారం  వినాయక నిమజ్జన ఘాట్ ను జిల్లా ఎస్పీ శ్రీ సిద్దార్థ్ కౌశల్  ఐపియస్ గారు పరిశీలించారు. కెసి కెనాల్ , వినాయక్ ఘాట్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు.రేపు(సెప్టెంబర్ 8న) గణేష్ నిమజ్జనం సంధర్బంగా వినాయక విగ్రహాలను ఎత్తే భారీ క్రేన్లను దానికి సంబందించిన డ్రైవర్లను, గజ ఈత గాళ్ళను సిద్దంగా ఉంచుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని  సంబంధిత అధికారులకు తెలియజేశారు.  జిల్లా ఎస్పీ గారి వెంట కర్నూలు పట్టణ డిఎస్పీ కె వి మహేష్, సిఐలు తబ్రేజ్ , శివశంకర్, గణేష్ ఉత్సవ సమితి కమిటి సభ్యులు, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.



# అదేంటీ 'బాహుబలి'.. 'కరణ్ అర్జున్' సినిమానా?



బాలీవుడ్ గత కొంత కాలంగా గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కొంటోంది. కానీ ఇదే సమయంలో దక్షిణాది సినిమాలు దేశ వ్యాప్తంగా సంచలన విజయాల్ని నమోదు చేసుకుంటున్నాయి. ఈ విషయంలో బాలీవుడ్ వర్గాలలో గత కొన్ని నెలలగా చర్చ జరుగుతోంది. బాలీవుడ్ సినిమాలు ఆడకపోవడంపై పలువురు ఎవరికి తోచింది వారు చెబుతూ వస్తున్నారు. కొంత మంది కంటెంట్ సరిగా లేదని కామెంట్ లు చేస్తే మరి కొంత మంది మేకర్స్ లో వున్న ఆలోచనా విధానం మారాలని కామెంట్ లు చేస్తున్నారు.ఈ నేపథ్యంలో బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్ ఫాదర్ యాక్టర్ డైరెక్టర్ రాకేష్ రోషన్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. 'ఘర్ ఘర్ కీ కహానీ' సినిమాతో నటుడిగా ప్రయాణం మొదలు పెట్టిన రాకేష్ రోషన్ 'గూండాగర్డ్' మూవీతో దర్శకుడిగా మారారు. కరణ్ అర్జున్ కహోనా ప్యార్ హై కోయి మిల్ గయా క్రిష్ క్రిష్ 2 క్రిష్ 3 సినిమాలతో దర్శకుడిగా మంచి గుర్తింపుని సొంతం చేసుకున్నారు. త్వరలో తనయుడు హృతిక్ రోషన్ తో 'క్రిష్ 4'ని తెరపైకి తీసుకురాబోతున్నార.ఈ నేపథ్యంలో ఓ  బాలీవుడ్ మీడియాతో ప్రత్యేకంగా మాట్లాడిన రాకేష్ రోషన్ బాలీవుడ్ మేకర్లపై నిప్పులు చెరిగారు. బాలీవుడ్ ఎదుర్కొంటున్న ఫెల్యూర్స్ కి గల కారణాలు వెల్లడించారు. బాలీవుడ్ సినిమాలు ఫ్లాప్ కావడానికి ప్రధాన కారణం మేకర్సే అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫిల్మ్ మేకర్స్ తాము తమ స్నేహితుల కోసమే సినిమాలు తీసుకుంటున్నారని ప్రేక్షకుల ఇష్టపడే సినిమాలు కాకుండా తాము తమ స్నేహితులకు ఇష్టమైనవి మాత్రమే చేస్తున్నారని అలాంటి సినిమాలని చాలా తక్కవ మంది చూస్తారని మెజారిటీ ప్రేక్షకులు వాటిని ఆదరించడం లేదని స్పష్టం చేశారు.ప్రేక్షకులకు సంబంధం లేని కథలతో సినిమాలు చేస్తున్నారని. అలాంటి కథల్ని ఎంచుకుంటున్నారని అందుకే హిందీ సినిమాలు బాక్సాఫీస్ వద్ద రాణించడం లేదని తెలిపారు. దక్షిణాది సినిమాలు ఆడటానికి కారణం చెబుతూ..ఇప్పటికీ జనాల జీవితాలను చూపించే కథలకే దక్షిణాది మేకర్స్ కట్టుబడి వున్నారని అలాంటి కథలకు కమర్షియల్ సెన్సిబులిటీస్ ని జోడించి చాలా అప్ గ్రేడ్ గా సినిమాలు చేస్తున్నారని బాహుబలి ఖీఖీఖీ అలాంటి కథలే అన్నారు.అంతే కాకుండా బాహుబలి తాను రూపొందించిన 'కరణ్ అర్జున్'ని పోలి వుంటుందని అయితే అదే కథకు మార్పులు చేసి భారీ స్థాయిలో తెరకెక్కించారని ఆ కారణంగానే ప్రేక్షకులు ఆయా సినిమాలని ఆదరించారన్నారు. కానీ బాలీవుడ్ మేకర్స్ మాత్రం భారతీయ మూలాలని మరి అధునికత పేరుతో చెత్తని తెరమీదికి తీసుకొస్తున్నారని అది కేవలం ఒక శాతం ప్రేక్షకులకే నచ్చుతోందని తెలిపారు. ఆ సినిమాలు బిసి సెంటర్ల ప్రేక్షకులకు అంతగా నచ్చడం లేదని ప్రేక్షకులు ఆదరించే కథలని ఎంచుకుని బాలీవుడ్ మేకర్స్ ఇప్పటికైనా జాగ్రత్త పడితే మంచి సినిమాలు వస్తాయని ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారన్నారు.

# హిందీలో రష్మిక బిగ్ లాంచ్ సక్సెస్సేనా?



రష్మిక మందన్న బ్యాక్ టు బ్యాక్ రిలీజ్ లతో ప్రొఫెషనల్ గా దూసుకుపోతోంది. ప్రస్తుతం తన బాలీవుడ్ తొలి చిత్రం 'గుడ్ బై' విడుదల సన్నాహకాల్లో ఉంది. తండ్రి కూతుళ్ల అనుబంధం నేపథ్యంలో ఎమోషనల్ డ్రామా కథాంశంతో తెరకెక్కిన 'గుడ్ బై' అక్టోబర్ 7న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది. ఇందులో అమితాబ్ కి రష్మిక కుమార్తెగా నటిస్తోంది.  రష్మిక నటించిన మరో బాలీవుడ్ చిత్రం 'మిషన్ మజ్ను'(సిద్దార్థ్ మల్హోత్రా హీరో) కూడా విడుదల కావాల్సి ఉంది. కానీ ఈ మూవీ రిలీజ్ కొంత ఆలస్యమవుతోంది. నిజానికి రష్మిక తొలిగా ప్రారంభించినది మిషన్ మజ్ను. ఈ చిత్రం బాలీవుడ్ డెబ్యూ మూవీగా రిలీజ్ కావాల్సి ఉన్నా ప్రస్తుతం నిర్మాణానంతర పనుల జాప్యంతో రిలీజ్ డిలే అవుతోంది. ఇంతలోనే చాలా ఆలస్యంగా ప్రారంభించిన గుడ్ బై విడుదలకు సిద్ధమైపోయింది. ఏదైతేనేం రష్మిక నటించిన డెబ్యూ మూవీ విడుదలకు ఇంకో నెలరోజులే సమయం ఉంది. ఈ మూవీలో రష్మిక అద్భుతంగా నటించిందని నిరూపిస్తూ ఇంతకుముందు విడుదలైన గుడ్ బై ట్రైలర్ ఆకట్టుకుంది. రష్మిక తొలి చిత్రంతోనే హిట్టు కొట్టి తన హవాను బాలీవుడ్ లోనూ కొనసాగిస్తుందా లేదా? అన్నది వేచి చూడాలి.తాజాగా గుడ్ బై ట్రైలర్ ఈవెంట్ లో రష్మిక మందన 'పుష్ప 2' గురించి కూడా వెల్లడించింది.  ఇది 2020 బ్లాక్ బస్టర్ చిత్రం పుష్ప: ది రైజ్ కి సీక్వెల్. త్వరలో పుష్ప 2 షూటింగ్ ప్రారంభం కానున్నందున ఇద్దరు 'ఎ' లిస్టర్ స్టార్లు అమితాబ్ బచ్చన్- అల్లు అర్జున్ లతో కలిసి పనిచేయడం ఎలా అనిపిస్తోంది? అని ప్రశ్నించగా రష్మిక మందన్న మాట్లాడుతూ-"నేను నా కలను జీవిస్తున్నాను.. ఎందుకంటే  అల్లు అర్జున్ సర్ తో త్వరలో పుష్ప 2 ను ప్రారంభించబోతున్నాను. కేవలం మరో రెండు రోజుల్లోనే లాంచింగ్. ప్రస్తుతం బచ్చన్ సార్ తో గుడ్ బై ప్రచారంలో బిజీగా ఉన్నాను. ట్రైలర్ ప్రేక్షకుల్లోకి వెళ్లింది. దీని గురించి ప్రజలే చెబుతారు. అమితాబ్ సర్ తో పని చేయడం గొప్ప అనుభూతులను మిగిల్చింది" అని అంది.'పుష్ప: ది రైజ్' భారీ విజయం సాధించిన తర్వాత అల్లు అర్జున్ - రష్మిక మందన్న బృందం మోస్ట్ అవైటెడ్ సీక్వెల్- పుష్ప ది రూల్ తో మరో సక్సెస్ ని ఖాతాలో వేయాలని ఉవ్విళ్లూరుతోంది. సుకుమార్ పుష్ప 2 పూజ వేడుకను బన్నీ - రష్మిక లేకుండా చివరి నిమిషంలో ప్లాన్ చేసారని తెలిసింది. ఎందుకంటే రానున్న మూడు నెలల వరకు ఎటువంటి శుభకార్యానికి మంచి తేదీ లేదు. బన్నీ ఇటీవల న్యూయార్క్ నుంచి తిరిగి వచ్చాడు. ఇప్పుడు సెప్టెంబర్ మూడవ వారంలో షూటింగ్ ప్రారంభించే ముందు తన కుటుంబంతో తగినంత సమయం గడుపుతున్నాడు.

# 'భైరవద్వీపం' కోసం 10 రోజుల పాటు భోజనం చేయని బాలయ్య!

సింగీతం శ్రీనివాసరావు .. ఈ పేరు వినగానే దర్శకుడిగా ఆయన చేసిన ప్రయోగాలు .. నిర్మాతగా చేసిన సాహసాలు గుర్తుకు వస్తాయి. సంగీత దర్శకుడిగా .. రచయితగా కూడా ఆయనకి మంచి అనుభవం ఉంది.  తెలుగు .. తమిళ ... మలయాళ .. కన్నడ భాషల్లో ఆయన అనేక సినిమాలను తెరకెక్కించారు. 'పుష్పక విమానం' ... ' భైరవ ద్వీపం' ... 'ఆదిత్య 369' వంటి సినిమాలు ఆయన చేసిన ప్రయోగాలకు అద్దం పడతాయి. అలాంటి ఆయన తాజాగా 'ఆలీతో సరదాగా' కార్యక్రమంలో పాల్గొన్నారు. తన కెరియర్ కి సంబంధించిన అనేక విషయాలను పంచుకున్నారు.'భైరవ ద్వీపం' సినిమాను గురించి



ఆయన మాట్లాడుతూ .. "ఈ సినిమాలో ఒక పాటను వేటూరి గారు రాయాలి. గతంలో నా సినిమాలలో చాలా పాటలు ఆయనే రాశారు. కానీ ఈ సారి ఆయన ఇదిగో వస్తున్నాను .. అదిగో వస్తున్నాని అంటున్నారు గానీ రావడం లేదు.ఆయన రాకపోవడం వలన పని ఆగిపోకూడదనే ఆవేశంతో నేనే ఆ సందర్భానికి తగినట్టుగా ఒక పాట రాశాను. ఆవేశం తగ్గిన తరువాత వేటూరి గారికి మళ్లీ కబురు చేస్తే ఆయన వచ్చారు. నేను రాసిన పాటను చూపించాను .. అది బాగోలేదనిపిస్తే ఆయనను రాయమని అన్నాను. కానీ నేను రాసిన ఆ పాట చాలా బాగుందని ఆయన అన్నారు. అదే 'విరిసినదీ వసంతగానం' సాంగ్.'భైరవద్వీపం' సినిమాలో బాలకృష్ణ గారిని కురూపిగా చూపించవలసి వచ్చింది. జనం ఎప్పుడూ కూడా  ఊహించనవి చేసేవాడే హీరో అనుకుంటారు. అందువలన బాలకృష్ణను ఆ విధంగా చూపించేసరికి వాళ్లంతా ఆశ్చర్యపోయారు .. మరింతగా కథలోకి వెళ్లిపోయారు. బాలకృష్ణ గారు ఎంతో  గొప్పగా చేశారు అని చెప్పుకున్నారు. ఆ గెటప్ కోసం బాలకృష్ణగారు చాలా కష్టపడ్డారు. 10 రోజుల పాటు ఉదయం నుంచి సాయంత్రం వరకూ అదే గెటప్ లో ఆయన ఉండేవారు.ఆ గెటప్ తో భోజనం చేయడం కుదరదు. అందువలన జ్యూస్ లు మాత్రమే ఇస్తుండేవాళ్లం. ఆ జ్యూస్ లు కూడా స్ట్రా తో మాత్రమే తాగేవారు. ఒకరోజున ఒక షాట్ కి సంబంధించిన లైటింగ్ కి సమయం పడుతుందని బాలకృష్ణగారిని మధ్యాహ్నం 12 గంటలకు రమ్మని చెప్పాము.అదే విషయం ఆయన ఎన్టీఆర్ తో చెప్పారట. "ఒకవేళ లైటింగ్ ముందుగానే ఓకే అయితే నీ ద్వారా షూటింగు లేట్ కాకూడదు  .. వెళ్లు" అని బాలకృష్ణగారిని ఎన్టీఆర్ పంపించారు. ఎన్టీఆర్ గారి నుంచే బాలకృష్ణ గారికి ఆ క్రమశిక్షణ వచ్చింది" అని చెప్పుకొచ్చారు.

# క్వార్టర్స్‌లో ఓడిన కిర్గియోస్.. కోపంతో రెండు రాకెట్లను విరగొట్టాడు..



న్యూయార్క్: యూఎస్ ఓపెన్ నుంచి నిక్ కిర్గియోస్ ఔటయ్యాడు. ఉత్కంఠభరితంగా సాగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్ మ్యాచ్‌లో 7-5 4-6 7-5 6-7 (3-7) 6-4 స్కోర్‌తో కిర్గియోస్‌పై రష్యా ప్లేయర్ కారెన్ కచనోవ్ గెలుపొందాడు. 27 ఏళ్ల ఆస్ట్రేలియా ప్లేయర్ కచనోవ్ ఓ గ్రాండ్‌స్లామ్‌లో సెమీస్‌కు వెళ్లడం ఇదే తొలిసారి. సెమీస్‌లో కాస్పర్ రుడ్‌తో కచనోవ్ తలపడనున్నాడు. అయితే ఈ టోర్నీ నుంచి రఫేల్ నాదల్ నిష్క్రమించడంతో.. ఈసారి మెన్స్ సింగిల్స్ చాంపియన్ టైటిల్‌ను కొత్త ప్లేయర్ సొంతం చేసుకోన్నాడు. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో.. కీలకమైన అయిదో సెట్‌లో కచనోవ్ చాలా చాకచక్య ఆటను ప్రదర్శించాడు. కర్గియోస్‌ను వత్తిడిలోకి నెట్టిన కచనోవ్.. ప్రెజర్ గేమ్‌ను చాలా కూల్‌గా ఆడాడు. టెన్షన్ తట్టుకోలేకపోయిన కిర్గియోస్ రెండుసార్లు తన వద్ద ఉన్న రాకెట్లను విరగొట్టాడు.

# కామన్వెల్త్ మెడలిస్ట్‌లపై 'బాయ్' కాసుల వర్షం

న్యూఢిల్లీ: కామన్వెల్త్ గేమ్స్‌లో పతకాలు సాధించిన షట్లర్లు, సహాయ బృందానికి కలిపి రూ.1.5 కోట్ల నగదు బహుమతి ఇవ్వనున్నట్టు 'బాయ్' మంగళవారం వెల్లడించింది. బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ క్రీడల్లో చాంపియన్లుగా నిలిచిన పీవీ సింధు, లక్ష్యసేన్‌కు చెరో రూ.20 లక్షలు, డబుల్స్‌లో స్వర్ణం సాధించిన సాత్విక్-చిరాగ్ శెట్టికి చెరి 12.5 లక్షలు, శ్రీకాంత్ వరల్డ్ చాంపియన్‌షి?ప రజతానికి రూ.10 లక్షలు, బర్మింగ్‌హామ్ కాంస్యానికి రూ.5 లక్షలు, గాయత్రి-ట్రిసా (కాంస్యం)కు చెరి రూ. 3.75 లక్షలు, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో పతకాలు సాధించిన ఒక్కొక్కరికి రూ.3 లక్షలు, సహాయ సిబ్బందికి రూ.1.50 లక్ష ఇవ్వనున్నారు. బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ క్రీడల బ్యాడ్మింటన్‌లో భారత్ 3 స్వర్ణాలు, ఒక రజతం, 2 కాంస్యాలు సాధించడం తెలిసిందే.

# భారత్‌పై 6 వికెట్ల తేడాతో శ్రీలంక ఘన విజయం

దుబాయ్: భారత్‌పై 6 వికెట్ల తేడాతో శ్రీలంక ఘన విజయం సాధించింది. భారత్ నిర్దేశించిన 174 పరుగుల విజయ లక్ష్యాన్ని శ్రీలంక బ్యాట్స్‌మెన్స్ అలవోకగా ఛేదించారు. 19.5 ఓవర్లలో శ్రీలంక 4 వికెట్లు కోల్పోయి 174 పరుగులు చేసింది. ఆసియా కప్ సూపర్-4లో భాగంగా భారత్-శ్రీలంక మధ్య టీ20 మ్యాచ్ జరిగింది. 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి భారత్ 173 పరుగులు చేసింది. ఆసియా కప్ సూపర్-4లో భారత క్రికెట్ జట్టు రెండు మ్యాచ్‌ల్లో ఓటమి పాలైంది.ఒక బాల్ మిగిలి ఉండగానే శ్రీలంక లక్ష్యాన్ని ఛేదించింది. డూ ఆర్ డై మ్యాచ్‌లో రోహిత్ సేన ఓటమి చవిచూసింది. భారత్ బ్యాటింగ్: రోహిత్ శర్మ 72, సూర్యకుమార్ 34, హార్దిక్ పాండ్యా 17, రిషబ్ పంత్ 17 పరుగులు చేసి ఔటయ్యారు. అశ్విన్ 15, అర్ష్‌దీప్ సింగ్ 1 పరుగు చేసి నాటౌట్‌గా నిలిచారు.శ్రీలంక బౌలింగ్: దిల్షాన్ 3 వికెట్లు పడగొట్టాడు. శ్రీలంక బ్యాటింగ్: మెండిస్ 57, నిశాంక 52  పరుగులు చేసి ఓటయ్యారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**